# పాతిక పరభాషా చిత్రాలు

మంచి సినిమాల పరిచయం

- కిరణ్‌ప్రభ




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 164

| | | |
|---|---|---|
| టు కంట్రీస్ | మళయాళం | 3 |
| ఛార్లీ | మళయాళం | 4 |
| సేతుపతి | తమిళం | 5 |
| కెండసంపిగె | కన్నడం | 6 |
| అది కప్యారే కూటమణి | మళయాళం | 7 |
| విశారణై | తమిళం | 8 |
| ఎన్ను నింటె మొయుదీన్ | మళయాళం | 9 |
| అనార్కలి | మళయాళం | 10 |
| సు..సు..సుధి వల్మీకం | మళయాళం | 11 |
| పెక్ యెకిండ | టర్కిష్ | 12 |
| కుంజిరామాయణం | మళయాళం | 13 |
| వెళ్ళాయ ఇరుకిరవన్ పోయి సొల్ల మాటన్ | తమిళం | 14 |
| ది సిరియన్ బ్రైడ్ | ఇజ్రాయిల్ | 15 |
| 144 | తమిళం | 16 |
| కాస్ట్ ఎవే | కొరియన్ | 17 |
| గుటెన్ టాగ్ రమోన్ | స్పానిష్/ జెర్మన్ | 18 |
| వేరీజ్ మై ఫ్రెండ్స్ హోం | పర్షియన్ | 19 |
| బేకాస్ | కుర్దిష్ | 20 |
| మేరే డాడ్ కి మారుతి | హిందీ | 21 |
| ఉప్పు కరవాడు | తమిళం | 22 |
| ఓపెన్ టి బయస్కోప్ | బెంగాలీ | 23 |
| కుట్రాడు తమిళ్ | తమిళం | 24 |
| ఎలిజిబెత్ ఏకాదశి | మరాఠీ | 25 |
| నానుం రౌడీ దాన్ | తమిళం | 26 |
| చిల్లర్ పార్టీ | హిందీ | 27 |




**Two Countries** is a 2015 Indian Malayalam-language romantic comedy film written by Rafi and directed by Shafi.

-------------

బడ్జెట్ ఐదారు కోట్లు – వసూళ్ళు 60 కోట్లు..!! ఏముందీ సినిమాలో..!?మొదట్నుంచీ చివరిదాకా కడుపుబ్బ నవ్వించే ఆరోగ్యకరమైన హాస్యం, చురకత్తుల్లాంటి సంభాషణలు, అద్భుతమైన టైమింగ్ తో సాగే కామెడీ దృశ్యాలు..! ఇవి చాలు సినిమా విజయానికి – అని మరోసారి నిరూపించిన మళయాళం సినిమా ఇది.! తరచి చూస్తే కథలో కొత్తదనం లేదనిపించవచ్చు, కానీ ప్రతి దృశ్యాన్నీ సరికొత్తగా అనిపించేలా, కనిపించేలా తీర్చిదిద్దిన దర్శకుడ్ని అభినందించాలి. ఎక్కడా సాగతీయడం అనేది లేకుండా, బోలెడు కథని శరవేగంతో పరుగులుతీయించాడు దర్శకుడు. సాధారణంగా హాస్య చిత్రం అంటే ప్రధాన కథకి సంబంధం లేని నవ్వుల దృశ్యాలు చోటుచేసుకోవడం సహజం, అంతా నవ్వే కాబట్టి అవి పెద్ద సైడ్ ట్రాక్ అనిపించవు. అలా కాకుండా హాస్య చిత్రంలో కూడా ప్రతి పాత్రనీ, ప్రతి దృశ్యాన్నీ కథకి సంబధం ఉండేలా దర్శకుడు స్క్రీన్ ప్లే వ్రాసుకున్న విధానం అధ్యయనం చెయ్యాల్సిన అంశం అనిపిస్తుంది. దిలీప్, మమతా మోహన్ దాసులు ప్రధానపాత్రలు పోషించిన ఈ సినిమా కథ విషయానికి వస్తే –

అనగనగా ఓ టక్కరి కుర్రాడు. పెద్దగా శ్రమచేయకుండా చిన్న చిన్న ట్రిక్స్ తో డబ్బులు సంపాదించడంలో దిట్ట. ఉల్లాస్ అని తనపేరే ఉన్న ఓ పేరుమోసిన పార్టీ కేండిడేట్ ఎలక్షన్లలో పోటీ చేస్తుంటే, తనూ పోటీ చేసి ఓటర్లని గందరగోళానికి గురిచేసి ఆ కాండిడేట్ ని ఓడించి , ప్రతి పక్షాన్ని గెలిపించి, వాళ్ళ దగ్గర కమీషన్ నొక్కేస్తాడు. ఇది మనవాడి ప్రతిభకి ఒక ఉదాహరణ. అనుకోని పరిస్థితుల్లో కెనడాలో స్థిరపడ్డ ఓ మళాయాళీ అమ్మాయిని పెళ్ళి చేసుకునే అవకాశం వస్తుంది. కేరళలోని సొంత వూళ్ళోనే పెళ్ళి జరిగింది. ఐతే మొదటి రాత్రే ఆ అమ్మాయి మందు బాటిల్ ఓపెన్ చేస్తుంది. తానో క్రానిక్ ఆల్కహాలిక్ నని చెబుతుంది. అక్కడనుంచి విపరీతమైన నవ్వు దృశ్యాలు. విమానంలో తనని మందు తాగవద్దన్నాడని కోపంతో, కెనడా ఎయిర్ పోర్ట్ లోనే మనవాడ్ని వదిలేసి అమ్మాయి వెళ్ళిపోయింది. నానా తంటాలూ పడి మనవాడు అమ్మాయి యింటికి చేరుకున్నాడు కెనడాలో. అ అమ్మాయితో మందు తాగడం మానిపిస్తే బోలెడంత ఆస్తి వస్తుందని తెలుస్తుంది. కథ వేగం పుంజుకుంటుంది... హీరో హీరోయిన్ల ఎత్తులూ పై ఎత్తులూ ప్రేక్షకుడ్ని ఊపిరి సలుపుకో నివ్వవు. కథని బేలెన్స్ చెయ్యడానికి అతికొద్ది సెంటిమెంట్ సంఘటనలూ ఉన్నాయి. ఐతే అనుకోని మలుపులతో ఆ అమ్మాయి మందు అలవాటు మానినా మనవాడితో విడాకులు తీసుకుంటుంది. ఒంటరిగా కేరళకి వచ్చేసి, మరో పెళ్ళి చేసుకునేందుకు పెళ్ళీపీటల మీదకి వెళుతుండగా ఎదురుచూడని మలుపు ప్రేక్షడికి షాక్ నిస్తుంది..! హాస్య ప్రధానమైన చిత్రం కాబట్టి సుఖాంతమే అనుకోండీ.. మొత్తం మీద నూటికి రెండొందల శాతం వినోదాన్ని పంచే చిత్రం!! అందుకే మళయాళం ప్రాంతీయ చిత్రమైనా అరవై కోట్లు వసూలు చెయ్యగలిగింది. పెద్ద విశ్లేషణ చెయ్యకుండా మంచి నవ్వులపువ్వుల సినిమా చూడాలనుకుంటే తప్పక చూడదగిన చిత్రం ఇది..!

★★★★




**Charlie** is a 2015 Indian Malayalam romantic film directed by Martin Prakkat

---------------

పెద్దలు కుదిర్చిన పెళ్ళి ఇష్టం లేని అమ్మాయి ,ఇంట్లో వాళ్ళకి తెలీకుండా బయటికి వచ్చేసింది. స్నేహితురాలి సహాయంతో పాండిచ్చేరి వెళ్ళింది. అక్కడ ఒక రూము అద్దెకి తీసుకుంది. అత్యంత అపరిశుభ్రంగా ఉన్న ఆ రూములోకి వెళ్ళిన వద్దనుంచి ఆమెకి వింత అనుభవాలు, విచిత్రమైన సందర్భాలు ఎదురయ్యాయి. కారణం – ఈమె కంటేముందు ఆ రూములో ఉండి వెళ్ళిన అబ్బాయి. ఆతను వదిలి వెళ్ళిన రేఖా చిత్రాల డైరీ ద్వారా అతని గురించి కొంత సమాచారం తెలిసింది. అదేమిటంటే – అతనో నిరంతర బాటసారి. ఎప్పుడు ఎక్కడ ఉంటాడో అతనికే తెలీదు. జీవితంలో ఎదురైన వాళ్ళందరికీ ఏదో విధంగా ఆత్మీయుడై పోతాడు. కానీ ఎక్కడా ఎక్కువకాలం ఉండడు. ఈ రూములో ఉన్నప్పుడు దొంగతనం చెయ్యడానికి వచ్చిన దొంగతో స్నేహం చేసి 'నువ్వు దొంగతనం ఎలా చేస్తావో చూస్తాను. పద, ఇద్దరం కలిసి వెళ్దాం' అని ఆ దొంగతో కలిసి అర్ధరాత్రి ఓ ఇంటికి వెళ్తాడు. ఇంటి పైకప్పు మీది పెంకులు తొలగించి లోపల కనిపించిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టులయ్యారు. – అంతే ఆ పుస్తకంలోని కథ అక్కడ ఆగిపోయింది. తర్వాత ఏమైందో అనే ఉత్కంఠ ఆ అమ్మాయితో బాటు చూస్తున్న ప్రేక్షకులకీ కలుగుతుంది. అక్కడనుంచీ ఆ అమ్మాయి, ఆ విచిత్రమైన అబ్బాయి ఎవరో తెలుసుకోవాలనీ, కలుసుకోవాలనీ అన్వేషణ మొదలుపెట్టింది. మిగతా సినిమా అంతా అతన్ని కలుసుకునే ప్రయాణంలో ఆమెకి ఎదురైన విచిత్రమైన అనుభవాలు, కలుసుకున్న రకరకల వ్యక్తులూ అతని కథ కొంచెం కొంచెం చెబుతుంటారు. ఒక్కో సంఘటనా తెలిసిన తర్వాత – ఆపై ఏం జరిగింది అనే సస్పెన్స్ తో సినిమా ముందుకి సాగుతుంది. ఈ కథలోని పాత్రల కేరక్టరైజేషన్ లో కొత్తపుంతలు తొక్కి, సినిమాని ఆసాంతం అత్యంత ఆసక్తికరంగా రూపొందించాడు దర్శకుడు. ఓ కోణంలోంచి చూస్తే ఇదంతా గుడ్ సమారిటన్ కథే కదా అనిపిస్తుంది, కానీ దర్శకుడు తన ప్రతిభతో ఈ సినిమాని ప్రేక్షకుల మనసుల్ని సున్నితంగా తాకే, సస్పెన్స్ సినిమాగా తీర్చిదిద్దాడు. ఎంచుకున్న లొకేషన్స్, పాత్రల వేషధారణ, కెమేరా పనితనం, అన్నింటినీ మించి పాటలూ, నేపథ్య సంగీతం , కళాదర్శకత్వం – అన్నీ సమపాళ్లలో కలిసి Highly Stylish Movie గా, ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసేలా ఈ చిత్రాన్ని మనకందించాయి. దర్శకత్వంతో బాటు గొప్పగా మెచ్చుకోవల్సింది గోపీసుందర్ సంగీతం. సంగీతమూ, కెమేరా కలిసి రంగుల ప్రపంచంలోని ఓ మంత్రనగరికి ప్రేక్షకుల్ని ఎగరేసుకుపోతాయి. సినిమా పూర్తయే సరికి ఒక ట్రాన్స్ లోనుంచి బయటికి వచ్చిన అనుభూతి కలిగిందంటే దర్శకుడి కృషి మీ హృదయాలని తాకినట్లే. మళయాళంలో మొదటి వరుసలో ఉన్న హీరో దుల్కర్ సల్మాన్ ఇందులో హీరో, నిరంతర బాటసారి, పాత్ర పోషించాడు. విచిత్రమైన అతని పాత్ర స్వభావం లాగానే, సినిమా మొదలైన అరగంట వరకూ అతను ( హీరో) తెరమీద కనిపించడు...! అదీ మళయాళ చిత్రపరిశ్రమలోని హీరోలకి కథమీద ఉన్న గౌరవం..! వైవిధ్యభరితమైన చిత్రీకరణని, సున్నితమైన కథాంశాన్ని, అందమైన లొకేషన్స్ ని ఆస్వాదించాలంటే .. – తప్పక చూడల్సిన చిత్రం చార్లీ..! కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నో అవార్డుల్ని, మళయాళీ ప్రేక్షకులనుంచి కలెక్షన్ల రివార్డుల్ని అందుకున్న సినిమా!

★★★★




**Sethupathi** is a 2016 Indian Tamil-language action film written and directed by S. U. Arun Kumar. విజయవంతమైన సినిమాల్లో ఓ రెండు రకాలు – కొత్త కథాంశాన్ని ఎన్నుకోవడం, పాత కథాంశాన్నే సరికొత్తగా చెప్పడం. ఈ రెండో విధానాన్ని అనుసరించే సినిమాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అలాంటి కోవకు చెందిందే ఈ విజయవంతమైన తమిళ సినిమా. చాలా మంది చాలా సార్లు చెప్పిన కథనే విభిన్నంగా, వినూత్నంగా చెబుతూ అత్యంత ఘన విజయం సాధించవచ్చు – అని ఇంకోసారి నిరూపించాడీ దర్శకుడు. ఈ సినిమా రీమేక్ హక్కులకోసం ఇతరభాషా చిత్రాల నిర్మాతలు క్యూ కట్టారంటే ఈ సినిమాలోని ఆకర్షణ శక్తిని ఊహించుకోవచ్చు.

కథంతా ఒక్క వాక్యంలో చెప్పాలంటే – నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ కి, ప్రొఫెషనల్ విలన్ కి మధ్య జరిగే దాగుడుమూతల ఆటలో ఎత్తులూ పై ఎత్తులూ.! కేరక్టరైజేషన్స్ లో కూడా మరీ కొత్తదనం ఏమీ లేదు. ఐనా సినిమా మొదటి దృశ్యం నుంచి చివరి దృశ్యం వరకూ కదలకుండా కూర్చోబెట్టగలిగాడు దర్శకుడు.

ఓ రోజు పొద్దునే ఊరిబయట ఒక పోలీసాఫీసర్ ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఆ కేసుని పరిష్కరించే బాధ్యత హీరో పోలీస్ ఆఫీసర్ మీద పడింది. మన హీరో కాస్త విలక్షణమైన వ్యక్తిత్వం ఉన్న నిజయితీగల పోలీస్ ఆఫీసర్. ఆతని పరిశోధనలో తేలిందేమిటంటే ఆ చనిపోయిన పోలీస్ మిస్టేకెన్ ఐడెంటిటీ అని. నిజానికి ఆ సమయంలో ఇంకో ఆఫీసర్ అక్కడ డ్యూటీ కి వెళ్ళాల్సి ఉందనీ, ఆ డ్యూటీ మిస్ ఐన ఆఫీసరే అసలు టార్గెట్ అనీ తెలిసింది. ఆతన్ని విచారిస్తే డొంకంతా కదిలింది. ఆతని మామ ప్రొఫెషనల్ గూండా. కుటుంబకలహాల వల్ల అల్లుడ్ని చంపించాలని ఆ విలన్ వేసిన ప్లాన్ ఓ అమాయకుడ్ని బలితీసుకుంది. ఇది తెలిసిన మన హీరో ఎలాగో ఆ గూండాని పట్టుకొచ్చి స్టేషన్లో చికబాదాడు. మరి సహజంగానే ఆ విలన్ ,పెద్దవాళ్ళ రికమండేషన్ తో విడుదలయ్యాక హీరో మీద పగబట్టాడు. ఇంక కథ అంతా ఆసక్తికరమైన మలుపులతో నడుస్తుంది. ఐనా విజయ్ సేతుపతి నటన, దర్శకుడి స్క్రీన్ ప్లే, ఆ పైన అత్యద్భుతమైన నేపథ్య సంగీతం, మెస్మరైజ్ చేసే కెమేరా పనితనం అన్నీ కలిసి ప్రేక్షకుడ్ని కదలకుండా కూర్చో బెడతాయి. ఎక్కడా విసుగు అనిపించని, సరికొత్త రీతిలో సాగిన పూర్తి స్థాయి కమ్మర్షియల్ సినిమా ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే 'సేతుపతి' చూడొచ్చు.

****




**Kendasampige** (Kannada: ಕೆಂಡಸಂಪಿಗೆ) is a 2015 Indian Kannada thriller film directed by Duniya Soori and written by Surendranath. It stars newcomers Santhosh Reva and Manvitha Harish in the lead roles 17–18 సంవత్సరాల వయసున్న అబ్బాయి, అమ్మాయి ఈ కథలో హీరో, హీరోయిన్లు. హీరోయిన్ ధనవంతుల అమ్మాయి, హీరో ఓ సాధారణమైన కుర్రాడు. అన్ని కథల్లోలానే ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఈ విషయం తెలిసిన హీరోయిన్ తల్లి, ఈ కుర్రాడ్ని అడ్డుతొలగించుకోడానికి ఓ పథకం వేసింది. దాని ప్రకారం పోలీసులు ఆ కుర్రాడి మీద అక్రమంగా గంజాయి కేసు బనాయించి కోర్టులో నిలబెట్టారు. శిక్షపడ్డాక పోలీస్ ఇన్స్పెక్టర్ వేన్ లో తీసుకెళ్తుండగా, నాటకీయ పరిస్థితుల్లో ఆ ఆ ఫీసర్ దగ్గరున్న పిస్తోల్ తోనే అతన్ని కాల్చి , వాన్ లోంచి దూకి పారిపోయాడు కుర్ర హీరో. చేతిలో గన్ ఉంది, అలవాటులేని నేరం, అనుకోకుండా జరిగిన సంఘటన... భయపడిపోతూ, హీరోయిన్ కి ఫోన్ చేసి , జరిగింది చెప్పాడు. ఇంట్లో వాళ్ళకి తెలీకుండా బయటపడ్డ ఆ అమ్మాయి హీరోని కలుసుకుంది. ఇక్కడ్నుంచి కథ అనూహ్యమైన వేగం పుంజుకుంటుంది. ఇద్దరూ కలిసి , ఒక వైపు పోలీసులునించి, ఇంకోవైపు పెద్దవాళ్ళ నుంచి తప్పించుకోడానికి కర్ణాటకలోని అన్ని ముఖ్య నగరాల్లో దాక్కుంటున్నారు...చివరికేమైందనేది మిగతా కథ. మామూలు సినిమాల్లాంటి ముగింపే ఉంటే ఈ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పుకునేందుకేముంటుందీ? ముగింపు ఏమిటనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే..! ఇంకో ట్విస్ట్ ఏమిటంటే – సినిమా ప్రారంభంలో ఈ కథకి ఏ మాత్రం సంబంధం లేని మరో నేరం జరుగుతుంది. దాన్ని మధ్యలో ఈ కథలో కలుపుతూ, టినేజ్ లవ్, క్రైం, సస్పెన్స్, థ్రిల్లింగ్ సన్నివేశాలూ.. అన్నింటినీ సమపాళ్ళలో కలుపుకుంటూ, అనూహ్యమైన మలుపులతో గంటన్నర సినిమాని ఉత్కంఠ భరితంగా రూపొందించాడు దర్శకుడు. ఒక్క సెకనుకూడా తెరమీదనుంచి దృష్టి మరల్చలేనట్లుగా అద్భుతమైన స్క్రీన్ ప్లేతో ఆసాంతం ఆసక్తికరంగా సాగిందీ సినిమా. టీనేజ్ పిల్లలు ఇద్దరూ కలిసి పారిపోవడం, ఒకే హోటల్లో రూం లో ఉండడం.. ఐనా ఎక్కడా ఇసుమంతైనా అసభ్యత లేకుండా కథ నడిపిన దర్శకుడ్ని అభినందించాలి. ఇలాంటి సినిమాలన్నింటిలోలానే కెమేరా,సంగీతం, ఎడిటింగ్ అన్ని విభాగాలూ ఈ సినిమా కీ హైలైట్స్.! ఇంకా గమనించాల్సిన అంశం – ఇది రెండో భాగం. ఇంకా మొదటి భాగం, మూడో భాగం రావాలి..! అందుకే ముగింపుని అత్యంత నేర్పుతో, సస్పెన్స్ తో ఆ రెండు భాగాలూ ఎప్పుడొస్తాయా అని ఎదురుచూసేలా చేశాడు దర్శకుడు. ఈ సినిమా పూర్తయినట్లూ ఉంటుంది, మిగతా భాగాలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసేలానూ ఉంటుంది..! కన్నడ చిత్రరంగంలో వస్తున్న కొత్త మలుపుకి ఒక ఉదాహరణ ఈ చిత్రం. ★★★★




**Adi Kapyare Kootamani** is a 2015 Malayalam suspense comedy film directed by John Varghese

---------------

పెద్దలు కుదర్చబోయే పెళ్ళి ఇష్టం లేని ఓ అమ్మాయి ఇంట్లోంచి బయటపడింది. అంతవరకూ పరిచయం లేని, కాలేజీ హాస్టల్లో ఉండే ' రాముడు మంచి బాలుడు' లాంటి, ఓ అబ్బాయి తారసపడ్డాడు. 'ఒక్క రాత్రి మీ అబ్బాయిల హాస్టల్లోకి తీసుకెళ్ళు. నీకు 20 వేల రూపాయలు ఇస్తాను' అంది. డబ్బుల అవసరంలో ఉన్న అతను సరే నన్నాడు. 'ఎందుకు? ఏమిటి?' లాంటి ప్రశ్నలు అడగవద్దని ముందే షరతులు పెట్టింది. సాహసం చేసి , ఇతరుల కంటపడకుండా రాత్రి పదింటికి , ఆ అమ్మాయిని హాస్టల్లో తన రూముకి తీసుకెళ్ళాడు. మధ్యలో ఒక రూము నంబరు అడిగి అందులోకి వెళ్ళి వచ్చింది. ఈ అబ్బాయి రూములోకి వెళ్ళాక, అతని చేతులు కట్టేసి క్రింద కూర్చోమని బెదిరించింది. తెల్లవారు ఝామున మూడింటికి నిద్రలేపమని చెప్పి పడుకుంది. నిద్రలేచి చూసే సరికి ఉదయం 9 దాటింది. ఇద్దరికీ కంగారు.!! సహజంగానే అబ్బాయిల హాస్టల్లో ఉదయం ఎలాంటి సన్నివేశాలు ఉంటాయో ఊహించుకోవచ్చు. అక్కడనుంచి కథ పాకాన పడుతుంది. ఎవరికీ కనిపించకుండా బయటికి వెళ్ళాలనుకునే క్రమంలో రెండురోజులపాటు అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. ఎవరి కంటా పడకుండా ఆ అమ్మాయి హాస్టల్లోంచి ఎలా తప్పించుకుంది, అసలు రాత్రి పూట అబ్బాయిల హాస్టల్ కే రావాల్సిన అగత్యం ఏమిటి, మధ్యలో ఒక రూం లోకి ఎందుకు వెళ్ళి వచ్చింది – ఈ ప్రశ్నలకి సమాధానాలే మిగతా సినిమా అంతా. ఊళ్ళో కూతుర్ని వెతుకుతూ తండ్రి చేసే తమాషా పనులు, హాస్టల్లో పక్కరూము కుర్రాళ్ళకి తెలీకుండా అమ్మాయిని దాచడం కోసం అబ్బాయి పడే అగచాట్లు, బయటికి తీసుకెళ్దామనుకున్న ప్రతిసారీ ఎదురుతిరిగే ప్రయత్నాలు... బోలెడంత వినోదం!! సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు చూశాము, క్రైం సస్పెన్స్ సినిమాలూ చూశాం.. వాటికి భిన్నంగా ఈ కథని సస్పెన్స్ తో కడుపుబ్బ నవ్వించే హాస్యాన్ని రంగరించి రెండు గంటల పాటు చక్కటి వినోదాన్ని , కాలక్షేపాన్ని అందించాడు దర్శకుడు. అబ్బాయిల హాస్టల్లో రాత్రి పూట ఓ అమ్మాయి – ఇలాంటి కథాంశాన్ని అతి జాగ్రత్తగా నడపకపోతే ఏ కొంచెం బాలెన్స్ తప్పినా అసభ్యత అంచులకి వెళ్ళే అవకాశం ఉంది. అలా కాకుండా చివరి వరకూ క్లీన్ ఎంటర్ టైనర్ గా నడిపిన దర్శకుడ్ని అభినందించాలి. ఇలాంటి ప్రయోగాత్మక సినిమాలకి ఆయువు పట్టు ఐన నేపథ్య సంగీతం ఈ చిత్రంలోనూ అద్భుతమైన పాత్ర పోషించింది. అలానే చిత్రంలో 99 శాతం నిజమైన బాయ్స్ హాస్టల్లో చాలా చిన్న గదుల్లో చిత్రీకరించినా ప్రేక్షకులనేమాత్రం ఇబ్బందికి గురిచేయకుండా, ఆ పరిసరాల్లోకి తీసుకెళ్ళిన కెమేరా పనితనాన్నీ అభినందించాలి. ఎలాంటి అంచనాలూ లేకుండా , రెండు గంటల పాటు ఆరోగ్యకరమైన కాలక్షేపం, కడుపుబ్బ నవ్వించే హాస్యం కావాలనుకునే వారికి తప్పక నచ్చే సినిమా. కేరళలో పదమూడు కోట్లు వసూలు చేసి సూపర్ హిట్ గా పేరుతెచ్చుకుంది..!!

★★★★



**Visaranai**: A powerful, chilling drama about how the System toys with us! Visaranai plays on our deepest cynicism, our deepest fears about the System.

అతని పూర్తి పేరు ఎం.చంద్రకుమార్. కోయంబత్తూర్ లో ఐతే ఆటో చంద్రన్ అంటే ఎవరైనా చెబుతారు. చదువు పదో తరగతి దాటలేదు. పేరులో ఉన్నట్లే వృత్తి ఆటో నడపడం. ప్రవృత్తి పుస్తకాలు వ్రాయడం. తమిళంలో ఇంతవరకూ ఆరు పుస్తకాలు పబ్లిష్ అయ్యాయి. ఇంకా వ్రాస్తూనే ఉన్నాడు. చంద్రకుమార్ 2006లో వ్రాసిన నవల ' ది లాకప్ ' ఆధారంగా వచ్చిన సినిమా Visaranai . కొద్ది వారాల క్రిందటే విడుదలైన ఈ సినిమా తమిళనాట సంచలనం సృష్టిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. క్రిందటేడాది వెనిస్ లో జరిగిన అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో పాల్గొని అక్కడా సంచలనం సృష్టించింది. ఏముందీ సినిమాలో? – పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపడాలూ, అమాయకుల్ని కేసుల్లో ఇరికించడాలూ, ఏ నేరం చెయ్యని అసహాయుల్ని పట్టుకొచ్చి నేరం ఒప్పుకోమని చిత్రహింసలు పెట్టడాలూ, నీచరాజకీయాల్లోని భయంకరమైన చీకటికోణాలూ... – ఇలాంటి వాటన్నింటినీ ధైర్యంగా, నగ్నంగా , ఏమాత్రం మొహమాటం లేకుండా తెరకెక్కించాడు దర్శకుడు వెట్రిమారన్. పోలీసు వ్యవస్థలోని అకృత్యాలని చాలా సినిమాల్లో చూశాం కదా అనిపించవచ్చు,... కానీ ఈ సినిమా ప్రత్యేకతలు చాలానే ఉన్నాయి. ఈ కథే నిజజీవితంలోంచి వచ్చింది. ఆటో చంద్రన్ యువకుడిగా ఉన్నప్పుడు 1983 లో ఇంట్లోంచి పారిపోయి అక్కడక్కడా తిరుగుతూ చివరికి గుంటూరు దగ్గరలోని ఓ పల్లెటూళ్ళో హోటల్ సర్వర్ గా జీవితం మొదలుపెట్టాడు. తమిళం తప్ప తెలుగురాదు. అక్కడ ఒక దొంగతనం కేసులో చంద్రన్ ని , మరో ముగ్గురినీ ఇరికించారు పోలీసులు. 'మాకేమీ తెలీదు మొర్రో ' అంటున్నా వినకుండా 'మేమీ కేసు క్లోజ్ చెయ్యకపోతే మాకు ఒత్తిడి వస్తుంది. అందువల్ల ఈ కేసు ఒప్పుకు తీరండి ' అని ఆ నలుగుర్నీ రెండు వారాల పాటు భయంకరమైన చిత్రహింసలకి బలిచేశారు. ఆ తర్వాత చంద్రన్ ని ఐదు నెలలపాటు జైల్లోనే బంధించారు. విడుదలయ్యాక ఆ నలుగురూ తమిళనాడుకి వచ్చేస్తూ ఎవరి త్రోవ వాళ్ళు చూసుకున్నారు. చంద్రన్ కోయంబత్తూర్ వెళ్ళిపోయి ఆటో నడుపుకుంటున్నాడు కానీ గుంటూరు పోలిసులు పెట్టిన చిత్రహింసలు అతన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఆ అనుభవాల ఆధారంగా 2006 లో ది లాకప్ అనే నవలవ్రాసి పబ్లిష్ చేశాడు. దాన్ని చదివిన తమిళదర్శకుడు వెట్రిమారన్ ( ఆడుకాలం దర్శకుడు, కాకాముట్టై నిర్మాతల్లో ఒకరు) ఆటోచంద్రన్ ని సంప్రదించి ఆ నవల హక్కులుకొని ఈ సినిమా నిర్మించాడు. సినిమా నిర్మాణం ప్రతిదశలోనే కాకుండా వెనిస్ వెళ్ళినప్పుడు కూడా ఆటోచంద్రన్ ని వెంటబెట్టుకుని వెళ్ళాడు వెట్రిమారన్! సరిగ్గా ఆటోచంద్రన్ నిజజీవితంలోని పాత్రలే ఈ సినిమాలోనూ ఉన్నాయి. సినిమా మొదటిభాగం గుంటూరు నేపథ్యంలో సాగింది. సినిమా రెండో భాగం మాత్రం బహుశా నవలలోని కథకి పొడిగింపు ఐ ఉండొచ్చు.

రెండు గంటల సేపు సాగే ఈ సినిమాలో ప్రతి దృశ్యమూ, ప్రతి ఫ్రేమూ పకడ్బందీగా రూపొందించబడింది.అక్కడక్కడా హింస ఎక్కువేమో అనిపిస్తుంది కానీ నిజజీవితానికి దగ్గరగా ఉండాలంటే అది అవసరమే. చిట్టచివరి నిమిషం వరకూ అత్యంత ఉత్కంత తో సాగిన థ్రిల్లర్ సినిమా లా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. పోలీసుల చక్రబంధంలో చిక్కుకున్న అమాయకుల్ని చూస్తుంటే 'అయ్యో ' అనిపిస్తుంది. పోలీసుల , రాజకీయనాయకుల ఎత్తులూ పై ఎత్తులూ చూస్తుంటే ' ఇదేనా మన వ్యవస్థ ' అనే భావమూ కలుగుతుంది. ఇందులోని నటులెవ్వరూ నటించలేదు. పాత్రలు తప్ప నటులెవ్వరూ కనిపించరు. సినిమామొత్తం మీద రెండే స్త్రీపాత్రలు మొత్తం ఐదు నిమిషాల లోపు నిడివిలో ఉంటారంతే. వెట్రిమారన్ దర్శకత్వంగురించి ఎంత వ్రాసినా సరిపోదు. కెమేరా మేన్ ప్రతిభా, వెట్రిమారన్ సృజనాత్మకత కలిసి ఈ చిత్రాన్ని అనితర సాధ్యం ఆనేలా చేశాయి. మధ్యతరగతి ఎపార్ట్ మెంట్ల మధ్య ఒక మురుగ్గుంట వద్ద చిత్రీకరించిన చివరి అరగంట క్లైమాక్స్ చూస్తుంటే దర్శకుడి ఊహాశక్తికి హేట్సాఫ్ చెప్పాల్సిందే! సాంకేతికంగా వాళ్ళు ఎంతో ముందుకి వెళ్ళిపోయారు అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇలాంటి సినిమాలని నిర్మించే సాహసం చేస్తున్న ధనుష్ గురించి ఇంకేం చెప్పాలీ!

****




**Ennu Ninte Moideen** (English: Forever yours, Moideen) is a 2015 Indian Malayalam-language romantic drama[2] film written and directed by R. S. Vimal, based on the real-life story of Moideen and Kanchanamala, which took place in the 1960s in Mukkam, Kozhikode

----------

సినిమాల్లోనైనా, నిజ జీవితంలోనైనా ప్రేమ కథలకి సాధారణంగా – రెండు , మూడురకాల ముగింపులే ఉంటాయి. అన్నీ కుదిరితే ప్రేమికులు కలుస్తారు, వివాహం చేసుకుంటారు, లేదంటే విడిపోయి వేర్వేరుగా జీవితాలు కొనసాగిస్తారు. కొన్ని విషాదాంత సినిమా కథల్లో ఒక్కరో, ఇద్దరూనో మరణిస్తారు. Ennu Ninte Moideen సినిమాలోని ప్రత్యేకత ఏమిటంటే – ఒకరినొకరు ఇష్టపడ్డాక, పెద్దలు ఒప్పుకోకపోవడం వల్ల 22 సంవత్సరాలు ఒకరినొకరు కలుసుకోకుండా, చూసుకోకుండా ఉన్నప్పటికీ , ఎప్పటికైనా కలుస్తామన్న ఆశతో ఇద్దరూ అవివాహితులుగా ఉంటారు. అనుకోని పరిస్థితుల్లో ప్రియుడు మరణిస్తాడు. మిగిలిన ఆ అమ్మాయిని అత్తగారు వొచ్చి ' మా అబ్బాయి బ్రతికుండగా నిన్ను కోడలిగా మాఇంటికి ఆహ్వానించలేక పోయాను. ఇప్పుడైనా నువ్వు కోడలిగా మా ఇంటికి రా..' అంటుంది. పెళ్ళికాని కోడలు అత్తగారి ఇంట్లోకి కాలు పెట్టడంతో ఈ సినిమా ముగుస్తుంది. ఈ కథ గురించి ఏవైనా సందేహాలుంటే రచయితని అడగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇది రచయిత ఊహల్లోంచి వచ్చిన కథ కాదు . ఈ కథ కేరళలో నిజంగా జరిగిన నిజజీవిత సంఘటనల్లోంచి తీసుకోబడింది. నిజ జీవితంలోని పేర్లనే ఈ సినిమాలోని పాత్రలకీ ఉపయోగించారు – కాంచన , మొయిదీన్ . కాంచన వయసు ప్రస్తుతం 75 సంవత్సరాలు . ఇంకా జీవించే ఉన్నారామె. పెళ్ళి చేసుకోలేక పోయిన భర్త వదిలి వెళ్ళిన సాంఘిక సేవా కార్యక్రమాలతో తమ ప్రేమకి సరికొత్త భాష్యాన్ని చెబుతూ, కొన్ని వందల జీవితాలని చక్కదిద్దుతున్నారు. ఐతే ఈ సినిమాలో – మొయుద్దీన్ మరణించాక కాంచన జీవితం గురించిన సంఘటనలని చూపించలేదు. బహుశా ఈ సినిమాకి రెండో భాగం కోసం ఆ కథని మిగిల్చారేమో అనిపిస్తుంది. ఇంక సినిమా దర్శకత్వం , చిత్రీకరణ విషయానికి వస్తే – ఈ దర్శకుడు , ఈ సినిమాటోగ్రాఫర్ తప్ప ఇంకెవ్వరూ ఈ సినిమాని ఇంత గొప్పగా , అద్భుతంగా తీర్చిదిద్దలేరనిపిస్తుంది. కాంచన , మొయుద్దీన్ ల మధ్య సాన్నిహిత్యం పెరిగే సన్నివేశాల చిత్రీకరణలోని ప్రతి దృశ్యమూ అద్భుతమైన దృశ్యకావ్యం, దర్శకుడి భావుకతకి జోహార్లు చెప్పాలనిపిస్తుంది.!! సినిమాలోని సంగీతాన్ని ఏమాత్రం తక్కువగా అంచనా వెయ్యలేం. అలానే తారాగణం కూడా. సీరియస్ కథలనీ, సెన్సిటివ్ కథనాలనీ ఇష్టపడేవాళ్ళు తప్పక చూడాల్సిన చిత్రం..!

★★★

**Anarkali** is a 2015 Indian Malayalam-language romantic-thriller film written and directed by Sachy.
- -----------------




మతాంతర ప్రేమ, ప్రియురాలి తండ్రి అడ్డుపడడం , ప్రేమికులు విడిపోవడం.. ఈ దశాబ్దం పాటు నిరీక్షణ, ఒకరి కోసం ఒకరు వెదకడం.. – చాలసార్లు వెండితెరమీద చూసిన కథే కదా..! ఐతే ఇదే అంతస్సూత్రమైనా – భిన్నమైన నేపథ్యంతో, చెప్పే విధానంలో అత్యంత వినూత్నమైన స్క్రీన్ ప్లే టెక్నిక్ ని అనుసరిస్తూ రెండు 2 గంటల 45 నిమిషాల పాటు ప్రేక్షకుల్ని కట్టిపడేస్తారు దర్శకుడు, సంగీత దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ కలిసి.! నేవీ నేపథ్యంలో, సినిమాలో 95 శాతం లక్షదీవుల్లోని కరవెట్టిలో చిత్రీకరణ జరుపుకున్న సినిమా. సినిమా మొదలైన ఇరవై నిమిషాల వరకూ కథ ఏమిటీ, ఏ పాత్ర ఎందుకువస్తోంది అని కాస్త గందరగోళంగా అనిపిస్తుంది. దర్శకుడు నెమ్మది నెమ్మదిగ కథలోని ఒక్కో పొరనీ విప్పుకుంటూ వెళుతుంటే ప్రేక్షకుడు తెరమీదనుంచి దృష్టి మరల్చలేడు. ప్రతి పదినిమిషలకీ కొంత సస్పెన్స్ ఓపెన్ చేయడం, మరో కొత్త సస్పెన్స్ ని క్రియేట్ చేయడం – దర్శకుడు, ఎడిటర్ ఇద్దరూ ఎంతో కసరత్తు చేసి ఉంటారు. ప్రియురాలి కోసం దశాబ్దం పైగా వెదుకుతున్న ప్రియుడు ( హీరో ) కూడా ఎప్పుడు విచారంగా కానీ, టెన్షన్ తో కానీ ఉండడు. అదీ కొత్త రకంగా ఉంటుంది. ఒకనొక ఉద్విగ్న పరిస్థితిలో మిత్రులకి కనపడకుండా ఏడ్వాలనిపించి సముద్రపు నీళ్ళలో అడుగుకి వెళ్ళి ( అతను డైవింగ్ శిక్షకుడు కూడా) తనివితీరా ఏడుస్తాడు.ఇలాంటి ఊహకందని దృశ్యాలు చాలానే ఉన్నాయి. లక్షదీవుల్లోని సముద్రతీరాన వెన్నెల్లో తీసిన ఐదు, పది నిమిషాల దృశ్యం సినిమాటోగ్రాఫర్ నైపుణ్యానికి మచ్చుతునకగా నిలుస్తుంది. లక్షదీవుల్లోని జీవన విధనాన్ని కూడా చక్కగా చిత్రీకరించాడు దర్శకుడు. పృధ్వీరాజ్ నటన గురించివేరే చెప్పాల్సిన అవసరంలేదు. పాత్రలో జీవించడం అతనికి అతి సులువైన పని. ముగింపు మామూలుగానే ఉన్నా చివరంటా కదలకుండా కూర్చోబెట్టే సినిమా. ఎక్కడా నిరుత్సాహపరచని చిత్రం. !!

★★★

**Su.. Su... Sudhi Vathmeekam** is a 2015 Malayalam comedy-drama film directed, co-written and co-produced by Ranjith Sankar.




-----------------

మానసికంగానీ, శారీరకంగానో పరిమితులున్న వ్యక్తి ఆ లోపాన్ని అధిగమించి జీవితంలో ఓ స్థాయిని చేరుకోవడం అన్న కాన్సెప్ట్ తో చాలా సినిమాలు వచ్చాయి, కొన్ని మంచి విజయాన్ని సాధించాయి కూడా. అదే కోవకు చెందిన చిత్రమే ఐనా దర్శకుడు తన సృజనాత్మకతతో సరికొత్తగా తీర్చిదిద్దిన మలయాళం సినిమా ఇది. ఎక్కడా విసుగు కలిగించకుండా, ప్రతి పాత్రనీ, దృశ్యాన్నీ అర్థవంతంగా రూపొందించి సినిమా ఆసాంతం అత్యంత ఆసక్తికరంగా చిత్రీకరించాడు దర్శకుడు. ఈ సినిమాలో హీరోకి, మాటలు వేగంగా పలకలేని అవరోధం ఉంటుంది. ఆ నత్తి వల్ల చిన్నప్పట్నుంచీ చాలా అవమానాలు ఎదుర్కొంటాడు. కొత్తవాళ్ళతో మాట్లాడుతుంటే ఆ ఇబ్బంది ఉంటుంది. పరిచయస్తులతో మాట్లాడుతుంటే అంత ఇబ్బంది ఉండదు. పెరిగి పెద్దయ్యాకా, ఒక స్కూల్లో గుమాస్తాగా ఉద్యోగంలో చేరాక, తన నత్తితో ఇబ్బందులు తప్పడం లేదు. అమ్మా, నాన్నా పెళ్ళి చేసుకోమన్నా 'ఏమో వచ్చే అమ్మాయి తో ఎలా మాట్లాడాలో..' అని సందేహిస్తాడు. పెద్దవాళ్ళు నచ్చజెప్పి పెళ్ళిచూపులకి సిద్ధం చేస్తారు. అందమైన అమ్మాయే వివాహానికి ఒప్పుకుంటుంది. పెళ్ళికి ముందు పెళ్ళికూతురు తన స్నేహితురాళ్ళకి హీరోని పరిచయం చేసిన సందర్భంలో , తన నత్తి వల్ల చాలా ఇబ్బంద్కి గురౌతాడు హీరో. పెళ్ళికూతురు తన స్నేహితురాలైన స్పీచ్ థెరపిస్ట్ వద్దకి తీసుకెళ్తుంది. ఇది చాలా అవమానంగా భావించిన హీరోతో ' పెళ్ళైన తర్వాత ఇంకా పొరపొచ్చలు వస్తాయేమో..మనం ఈ పెళ్ళి రద్దు చేసుకోవడమే మంచిది ' అంటుంది పెళ్ళి కూతురు. ఆ విధంగా హీరో భయపడినంతా జరిగింది. పెళ్ళి రద్దయింది. ఇంకా డిప్రెషన్లో ఉండగా అతను పనిచేసే స్కూలుకే ఆ స్పీచ్ థెరపిస్ట్ తాత్కలిక ఉద్యోగం మీద వస్తుంది. ఆమే తమ పెళ్ళి జరక్కుండా చేసిందని హీరో కోపంతో ఉంటాడు.ఈ లోగా స్కూల్లో జరిగిన డబ్బుల దుర్వినియోగం కేసులో సమస్యలెదురౌతాయి హీరోకి.అక్కడనుంచి తనని తాను సంస్కరించుకుంటూ, ఆత్మవిశ్వాసం పెంచుకుంటూ బ్యాంక్ మేనేజర్ గా ఎదగడం సినిమా కథ. ఐతే ఈ కథని సూటిగా చెప్పకుండా, చక్కటి సంఘటనని కవర్ గా చేసి అందులో ఈ కథని ఇమిడ్చి, కొంచెం కొంచెం గా చెప్పడంతో సినిమాలో సస్పెన్స్ ని పెంచాడు దర్శకుడు. గొప్ప సినిమా కాకపోవచ్చుకానీ మంచిసినిమా చూసిన అనుభూతిని మిగులుస్తుంది. ప్రత్యేకంగా చెప్పుకోవల్సింది నేపథ్య సంగీతం. ఎక్కడా హడావిడి లేకుండా కథ గమనానికి తగినట్లుగా సాగిన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. జయసూర్య ఇందులో హీరో. జయసూర్య, నివిన్ పౌలి, ఫహద్ ఫాజిల్, పృధ్వీరాజ్ లాంటి యువ హీరోలు ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా ఇలా వైవిధ్యభరితమైన పాత్రలు ఎంచుకుంటున్నారు. ప్రేక్షకులు కూడా వీళ్ల సినిమా వస్తోంది అంటే మళ్ళీ ఎలాంటి కొత్తదనం ఉందోనని ఎదురుచూస్తున్నారు. అందుకే మళయాళం లో ఇలాంటి మంచి సినిమాలు చూసే అవకాశం వస్తోంది..! ★★★★★

## **Pek Yakinda ( Coming Soon) 2014 Turkish Film:**




--------------------------------------------------------

ప్రపంచభాషా చిత్రాలను చూసే క్రమంలో ఈ టర్కిష్ సినిమా చూసే అవకాశం వచ్చింది. మిగతా దేశాల చిత్రాలతో పోల్చి 'బ్రహ్మాండం' లేదా 'సాధారణం' అనే కంటే ఈ సినిమాని ఈ సినిమాగానే చూస్తే చక్కటి కమ్మర్షియల్ సినిమా అనిపిస్తుంది. ముఖ్యంగా కథా, పాత్రలూ, సన్నివేశాలూ చాలావరకూ భారతీయభాషా చిత్రాలను గుర్తుతెచ్చాయి. భావోద్వేగాలూ, మానవసంబంధాలూ, భార్యాభర్తల మధ్యల విభేదాలూ, అనుబంధాలూ.. ఇవన్నీ పరదేశీ చిత్రం అనే భావం కలిగించలేదు. నటీనటులు, నేపథ్యం టర్కీ దేశానిదే కానీ సినిమా నడక అంతా అలవాటైన సినిమా చూస్తున్నట్లే ఉంది. చిన్న, చిన్న సంఘటనలతో కథని మలుపులు తిప్పడం, అంతర్లీనంగా సాగే హాస్యం, సెంటిమెంట్లు, సస్పెన్స్. క్లైమాక్స్ . ముఖ్యంగా ప్రధానపాత్రధారి నటన – సినిమాని ఆసాంతం ఆసక్తికరంగా కొనసాగించాయి. సినిమాలో హీరో మధ్యవయస్కుడు. చిన్నతనంలో సినిమాల్లో నటిద్దామని ప్రయత్నించి విఫలమయ్యాడు. విదేశీ చిత్రాలని పైరసీ చేసే బాస్ వద్ద ఉద్యోగం చేస్తుంటాడు. ఎలాంటి సినిమా ఐనా సరే పైరసీ చేసి మార్కెటింగ్ చేయడంలో దిట్ట. ఇతను చేసే ఈ చీకటివ్యాపారం నచ్చక భార్య విడాకులకోసం కోర్టు మెట్లు ఎక్కింది. ఎనిమిదేళ్ళ కొడుకు. భార్యతో సంబంధాలు సరిచేసుకునే క్రమంలో , కొంతకాలం పైరసీ బిజినెస్ కి దూరంగా ఉంటానని బాస్ కి చెప్పాడు. కోర్టు రూలింగ్ ప్రకారం భార్యతో కలిసి ఒకే ఇంట్లో ఉండకూడదు, చూసి రావడం వరకూ అనుమతి ఉంది. ఎలాగైనా భార్యతో విడాకుల కేసు విరమింపచేయించాలని అతని ప్రయత్నం. భార్య సినిమాల్లో కాస్ట్యూమర్ గా పనిచేస్తూ నటిగా అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తోంది. కొంతమంది మిత్రులతో కలిసి, భార్యకి తెలీకుండా, కొత్త సినిమా నిర్మాణం మొదలెడతాడు హీరో. ఆ సినిమాలో భార్యకే హీరోయిన్ వేషం వచ్చేలా చేస్తాడు. యూనిట్ వాళ్ళందరికీ అతని భార్యే అని తెలుసుకానీ, తనే నిర్మాతనన్న విషయం భార్యకి ఏమాత్రం తెలీకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు. కథ ఇంకా మలుపులు తిరుగుతూ, ఆ సినిమాలో హీరోకి డూప్ గా మొహానికి ముసుగువేసుకుని భార్యపక్కనే నటిస్తాడు కూడా , మన కథానాయకుడు. భర్త పక్కనే నటిస్తున్నాని తెలియని అతని భార్య, మధ్యలో పిల్లవాడి గురించిన సెంటిమెంట్ సీన్లు, ఆమె ఒంటరిగా ఉంటోందని తెలిసి దగ్గర అవ్వాలని చూసే కమేడీయన్ లాంటి పక్కింటి పెద్దమనిషి, చివరలో బయటపడే అతని విలనిజం , సరిగ్గా కథ క్లైమాక్స్ లో పైరసీ బాస్ పంపించిన విలన్లూ.... ఇలా సాగుతుంది సినిమా. సినిమా మొదటినుంచీ చివరి వరకూ ఎక్కడా విసుగు తెప్పించకుండా, బిగి సడలకుండా ఆసక్తికరంగా నడిపించాడు దర్శకుడు.సినిమాలో నిర్మాణమైన సినిమాని కూడా చివరలో సంక్షిప్తంగా చూపించడం మరో ఆకర్షణ! టర్కీలో కూడా మనకథా చిత్రాలను పోలిన సినిమాలు ఎలా తీస్తున్నారనే ఆసక్తితో ఈ సినిమా చూడొచ్చు. నిరాశపరచని చిత్రం.

★★★★

**Kunjiramayanam** is a 2015 Indian Malayalam comedy film




------------------------------------------------------------------

పాతికేళ్ళ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్, దర్శకుడిగా మారి, మళయాళం చిత్రరంగంలో సృష్టించిన ఓ అద్భుతం ఈ సినిమా! మొదటిసినిమాకే ఇంత విభిన్నమైన కథాంశాన్ని ఎన్నుకుని విజయవంతం చేసిన దర్శకుడు బాసిల్ జోసెఫ్ ని ఎంత అభినందించినా సరిపోదు. చివరలో క్లైమాక్స్ ఏవైనా కొన్ని పాతసినిమాలని గుర్తుచేస్తాయేమో కానీ 95 శాతం అంతా పూర్తిగా కొత్తదనంతో నిండిన సినిమా ఇది. అసలు ఇలాంటి కథతో సినిమా తియ్యొచ్చా అని ఆశ్చర్యం వేస్తుంది కూడా. కథానుసారం ఎక్కడో ఒకటి రెండు నిమిషాలు కనిపించే యువతులు తప్ప ఈ సినిమాలో హీరోయిన్ లేదు! ఐనా సినిమా అంతా ప్రేమకథల చుట్టూనే తిరుగుతుంది. హీరోయిన్ లేని ప్రేమకథల మయం ఈ చిత్రం. పూర్తిస్థాయి యాక్షన్ కామెడీ..నూటికి నూరు శాతం వినోదం. ఎన్నో విభిన్నమైన పాత్రలు, విచిత్రమైన మేనరిజమ్స్, ఊహించని మలుపులు, సీరియస్ కథలో నవ్వుల జల్లులు ఇవన్నీ ఒక ఎత్తు ఐతే కెమేరా పనితనం, సంగీతం ఇంకో ఎత్తు. ఈ సినిమాలో ప్రథమ బహుమతికి అర్హులైన సాంకేతిక నిపుణులు ముగ్గురు – దర్శకుడు, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ, సంగీతదర్శకుడు. లాండ్ స్కేప్స్ నేపథ్యంలో చిత్రీకరించిన రెండు పాటలు ప్రేక్షకుల్ని మరో లోకంలోకి తీసుకెళ్తాయి. ఆ పాటల చిత్రీకరణలోని ప్రతి ఫ్రేమూ ఒక దృశ్యకావ్యం..! వాణిజ్యపరంగానూ మూడు రెట్లు పైగా లాభాలు తెచ్చిపెట్టిన సినిమా!

కేరళలోని ఒక ఓ గ్రామం ఈ సినిమా కథకి వేదిక. కుంజిరామన్ అనే మన హీరో తన మేనమామ కూతుర్ని వివాహం చేసుకోవాలి. చాలా చిన్న తేడానే చిలికి చిలికి గాలివానై, ఆ సంబంధం చెడిపోతుంది. మేనమామకి తనేమిటో తెలియచెప్పాలని దుబాయ్ కి వెళ్తాడు మన కుంజిరామన్. ఓ సంవత్సరం పనిచేసి శెలవలకి వచ్చినపుడు మరో అమ్మాయితో పెళ్ళి సంబంధం కుదుర్చుకుంటాడు. కాబోయే భార్యకి ఇచ్చిన మాట ప్రకారం ఇంకెప్పుడూ సల్సా అనే మద్యం తీసుకోనని ప్రమాణం చేసి ఆ సల్సా మద్యం సీసాని ఊరుబయట రాయికేసి పగలగొట్టి, దుబాయ్ కి వెళ్తాడు మళ్ళీ ఉద్యోగానికి. కథలో మొదటి పెద్దమలుపు అక్కడమొదలవుతుంది. ఇంక ఆ వూళ్ళో ఎవరు సల్సా మద్యం సీసా తీసుకురావాలని ప్రయత్నించినా సరిగ్గా ఆ రాయి వద్దకి వచ్చేసరికి పగిలిపోతుంది. ఎవరు ఎంత ప్రయత్నించినా సల్సా సీసాని ఆ ప్రదేశం దాటించి ఊళ్ళోకి తీసుకురాలేరు. ఇదంతా కుంజిరామన్ పెట్టిన శాపం అనుకుంటారు.మళ్ళీ సంవత్సరానికి కుంజిరామన్ శెలవలకి ఊరికి వచ్చాడు. ఈసారి జరగాల్సిన అతని పెళ్ళి చిత్ర విచిత్రమైన మలుపులతో ఆగిపోతుంది. మళ్ళీ దుబాయ్ వెళ్ళి పోతాడు. ఈ సారి విచిత్రంగా ఊళ్ళో ఎవరికి పెళ్ళి నిర్ణయమైనా ఆగిపోతూ ఉంటుంది. ఇది కూడా కుంజిరామన్ శాపమే అనుకుంటారందరూ. ముచ్చటగా మూడోసారి శెలవలకి వచ్చినప్పుడు కుంజిరామన్ కి ఊళ్ళోవాళ్ళనుకునే మాటలు తెలుస్తాయి. ఎలాగైనా తనమీద నున్న అపవాదుని తొలగించుకోవాలనుకునే క్రమంలో బోలెడన్ని సరదా సన్నివేశాలు, ఊహించని మలుపులు, ఒకరి తర్వాత ఒకరుగా మారుతున్న పెళ్ళి కూతుర్లు, క్లైమాక్స్ లో మరిన్ని చిత్రవిచిత్రమైన మలుపులూ... – సినిమా పూర్తయ్యాక ఒక పూర్తి విభిన్నమైన సినిమా చూసిన భావం కలుగుతుంది. అందులోని పాత్రలూ, నవ్వులూ వెంటాడుతూనే ఉంటాయి.

ఇలాంటి సినిమాలు చూస్తుంటే అనిపిస్తుంది – ఇలాంటి సినిమాలని ఆదరించి మరిన్ని ప్రయోగాలు చేసే ధైర్యాన్నిస్తున్న మళయళీ, తమిళ ప్రేక్షకులు ఎన్ని సన్మానాలకైనా అర్హులు.. అని!! ★★★★★




**<u>Vellaiya Irukiravan Poi Solla Maatan</u>** is aTamil comedy film written and directed by newcomer A. L. Abanindran.

----------------

సినిమాల్లో సస్పెన్స్ అనేది అందులోని పాత్రల మధ్య ఉండాలే తప్ప, ప్రేక్షకులకి కాదు – అనే ఫార్ములా ఆధారంగా నిర్మించబడిన , ఇటీవలే విడుదలైన, విభిన్న తరహా తమిళచిత్రం. కాస్త సెంటిమెంటు, బోలెడంత సస్పెన్స్ ( వాళ్ళకీ వాళ్లకి మధ్యనే – మనకైతే అంతా తెలిసిపోతూనే ఉంటుంది.!) , ఆ గందరగోళంలోంచి బోలెడంత కామెడీ.. కొత్త దర్శకుడు చాలా కసరత్తుచేసి తయారుచేసుకున్న కథ! సంక్లిష్టమైన స్క్రీన్ ప్లే ప్రేక్షకుడ్ని కూడా ఒక్కోసారి గందరగోళానికి గురిచేస్తుంది కానీ మళ్ళీ త్వరలోనే ట్రాక్ లో పెడుతుంది. కేన్సరు వ్యాధికి గురైన తండ్రిని రక్షించుకోడానికి, 50 లక్షలకోసమని, మన హీరో తప్పనిసరి పరిస్థితుల్లో తన మాజీ ప్రేయసినే బ్లాక్ మెయిల్ చేయిస్తాడు. కొన్ని సంఘటనల తర్వాత ఆమే మన హీరోవద్దకొచ్చి 'ఎవరో నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. వాళ్ళడిగినంత ఇవ్వలేకపోతున్నాను. నా భర్తని బ్లాక్ మెయిల్ చేయిస్తావా?' అని అడుగుతుంది. ఇలా ఇలా ఈ బ్లాక్ మెయిలింగ్ అనేది ఒక చెయిన్ స్కీమ్ లా పెరిగిపోతుంది. తమ మెడకి చుట్టుకున్న సమస్యని వదిలించుకోడానికి కొందరూ, వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుందామని కొందరూ..బ్లాక్ మెయిల్ చెయిన్ ని పెంచుకుంటూ వెళ్తారు. నిజానికి ఇందులో ఎవ్వరూ చెడ్డవాళ్ళుగాన్నీ, మోసగాళ్ళుగానీ, ప్రొఫెషనల్ నేరస్థులుగానీ ఉండరు. అందరూ పరిస్థితుల ప్రభావం వల్ల ఆ ఉచ్చుని పెంచుకుంటూ వెళ్ళిన వాళ్ళే! చివరికా చెయిన్ ఓ పేద్ద బాస్ వద్దకి వెళ్ళి ఆగుతుంది. అప్పటికి బ్లాక్ మెయిల్ డిమాండ్ 100 కోట్లు అవుతుంది.! ఆ బాస్ కి అనుమానం వచ్చి తనని బ్లాక్ మెయిల్ చేయబోయినవాడ్ని పట్టుకుని కూపీలాగితే చెయిన్ లో ఒక్కో లింకూ పరిష్కారమవుతూ వస్తుంది. సగం వరకూ అలా వచ్చాక, మిగతా సగం, మొదలైన చోటినుంచీ విడిపోతూ వస్తుంది. ఇంత గందరగోళ కామెడీ చిత్రాన్ని చివరి ఐదు పదినిమిషాల్లో సెంటిమెంట్ సినిమాగా మార్చడంలో కృతకృత్యుడయ్యాడు కొత్త దర్శకుడు. అద్భుతమైన , విలక్షణమైన నేపథ్యసంగీతం సినిమా మూడ్ ని సరిగ్గా ప్రేక్షకులకి అందించగలిగింది.

నేల విడిచి సాముచేసిన కల్పిత కథే ఐనా, విభిన్నంగా సాగి ప్రేక్షకులని అలరించే సినిమా. కొత్తదనంతోసాగి నవ్వులుపండించే సినిమా చూస్తున్నప్పుడు, కాస్త మెదడుకి పదును పెట్టినా ఫరవాలేదు అనుకునే ప్రేక్షకులకి నచ్చుతుందీ చిత్రం. ఇలాంటి సరికొత్త ప్రయోగాలు చేస్తున్న తమిళదర్శకుల్ని, ఆ ప్రయోగాలని ఆదరిస్తున్న తమిళప్రేక్షకుల్నీ మరోసారి అభినందించాలి..!!

****




**The Syrian Bride** (הסורית הכלה) is a 2004 film directed by Eran Riklis.

---------------------------------------------------------------

పదేళ్ళ క్రిందట విడుదలై అంతర్జాతీయంగా అవార్డులు, విమర్శకుల ప్రశంసలు పొందిన ఇజ్రాయిల్ చిత్రం 'సిరియన్ బ్రైడ్ ' . దేశాల మధ్య యుద్ధాలు, జాతుల మధ్య విభేదాలు, రాజకీయ పోరాటాలు శతాబ్దాలుగా ఎన్నో తరాలని ధ్వంసం చేసిన, చేస్తున్న నేపథ్యంలో – మానవీయ సంబంధాలు ఎలా నలిగిపోతున్నాయో చూపించిన సినిమా ఇది. సిరియా దేశానికి, ఇజ్రాయిల్ కి మధ్యలో ఉన్న ఊరు గోలన్ హైట్స్. ఆ ప్రాంతం తమదే అనీ, ఇజ్రాయిల్ అన్యాయంగా ఆక్రమించుకుందనీ సిరియా వాదన. కాదూ ఆ ప్రాంతం తమదే అని ఇజ్రాయిల్ నమ్మకం. ఈ విభేదాల మధ్య నలిగిపోయే ఆ ప్రాంత ప్రజల పాస్ పోర్టుల్లో – జాతీయత – అనిశ్చితం – అని ఉంటుంది. ఆ వూళ్ళోని ఒక పెద్దకుటుంబం. యజమాని సిరియాకి అనుకూలంగా జరిగే ప్రదర్శనల్లో పాల్గొంటున్నాడని జైల్లో పెట్టారు. అతనికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు అమ్మాయిలు. అందులో చిన్న అమ్మాయికి పెళ్ళి కుదిరిన సందర్భంలో ఆ కుటుంబ పెద్దని జైలునుంచి పెరోల్ మీద విడుదల చేశారు. పెళ్ళికొడుకు సిరియాలోని ఒక టివి నటుడు. ఐతే ఇరుదేశాల మధ్యనున్న శత్రుత్వం వల్ల సిరియా నుంచి పెళ్ళికూతురు ఊరికి ఎవరూ రాలేరు. అందువల్ల పెళ్ళికూతురే సిరియాకి వెళ్ళాలి. ఒకసారి వెళ్ళాక మళ్ళీ తనవూరికి తిరిగి రాలేదు. అందుకే పెళ్ళి శుభకార్యమే ఐనా కుటుంబం సభ్యులంతా దిగాలుగా ఉన్నారు. రష్యా అమ్మాయిని చేసుకుని , నాన్న కోపానికి గురైన పెద్దబ్బాయి చెల్లెలి పెళ్ళికోసమని ఎనిమిదేళ్ళ తర్వాత ఊరికి వచ్చాడు. ఇంకా కోపం తగ్గని నాన్న అతనితో మాట్లాడలేదు. కోడల్ని, మనవడ్నీ కూడా పలకరించలేదు. విందు అయ్యాక, పెళ్ళి దుస్తులో అలంకరించిన పెళ్ళికూతుర్ని సిరియా వైపుకు పంపించాలి, సిరియా సరిహద్దుకి పెళ్ళికొడుకువాళ్ళొచ్చి తీసుకెళ్తారు. ఆ రెండు దేశాల మధ్య సరిహద్దు అంటే ఒక పెద్ద ముళ్ల కంచె, నిలువెత్తు ఇనుపగేట్లు. కుటుంబ సభ్యులంతా పెళ్ళి కూతుర్ని తీసుకుని సరిహద్దుకి వచ్చారు. కంచె అవతల పెళ్ళికొడుకు బృందం ఎదురుచూస్తోంది. అక్కడ మొదలౌతుంది 20 నిమిషాలు సాగే పతాక సన్నివేశం. తమదేశాన్ని వదిలి వెళ్ళొచ్చు అని ఇజ్రాయిల్ అధికారులు ఆ పెళ్ళికూతురు పాస్ పోర్ట్ లో స్టాంప్ వేస్తారు. దాన్ని సిరియా అధికారులు ఒప్పుకోరు 'వాళ్లెవరు స్టాంప్ వెయ్యడనికి ..అసలు ఆ వూరు సిరియా లోనిదే . ఈ స్టాంపు ఉంటే మేము సిరియాలోకి వెళ్ళాడానికి అనుమతి ఇవ్వం' అంటారు. మధ్యలో యు.ఎన్ అధికారులు సమస్యపరిష్కారానికి ప్రయత్నాలు చేస్తారు. ఐనా ఇరువైపు అధికారులూ పట్టు వీడరు. పెళ్ళికూతురు ముందుకి వెళ్ళలేక , వెనక్కి రాలేక సరిహద్దు గేటు దగ్గరే కూర్చుండి పోతుంది. నిమిషాలు గడుస్తున్నకొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది... చివరికేమైందనేది సినిమా ముగింపు. ముగింపుని సింబాలిక్ గా చూపించి మిగతాదంతా ప్రేక్షకుల ఊహకే వదిలేశాడు దర్శకుడు. ఈ ప్రధాన కథకి అనుబంధంగా ఇంకొన్ని ఆసక్తికరమైన సంఘటనలు ఆ కుటుంబసభ్యుల మధ్య జరుగుతాయి. ఒక కుటుంబానికి సంబంధించిన చిత్రం అని పైకి అనిపించినా నిజానికి , రాజకీయ సంక్షోభానికి దారితీస్తున్న పరిస్థితులపై, ఎన్నో ప్రశ్నలని సంధించాడు దర్శకుడు. అలానే ఆ కుటుంబ సభ్యుల మధ్య బాంధవ్యాలని గమనిస్తుంటే ఇండియా ఐనా, ఇజ్రాయిల్ ఐనా మరో దేశమైనా మానవ సంబంధాల్లో సారూప్యత ఉంటుందన్న విషయం మరోసారి ప్రస్ఫుటమౌతుంది. ఆలోచింపచేసే సినిమా , గంటన్నరసేపు మనల్ని ఆ ప్రదేశాల్లో , ఆ కుటుంబసభ్యులతో నడిపించే సినిమా.

****




144 is a 2015 Tamil comedy film directed by G Manikandan

-----------------------------------------

నెలక్రిందటే విడుదలైన తమిళ హాస్య చిత్రం. అద్భుతమైన సినిమా కాదేమో కానీ చక్కటి , వినూత్నమైన , ఆరోగ్యకరమైన హాస్యచిత్రం. రెండు గ్రామాల మధ్య ఒక చెరువు. శతాబ్దాలుగా ఆ చెరువులో ఎవరు చేపలు పట్టుకోవాలనే తగాదాలు, దానికితోడు ఒక వూరివాళ్ళు గాజుతోచేసిన వినాయకవిగ్రహాన్ని ఆ చెరువులో నిమజ్జనం చెయ్యడానికి సిద్ధమౌతుండగా , అల్లర్లు ఆపడానికి పోలీసులు విధించిన 144 సెక్షన్. ఇది కథా నేపథ్యం. ఐతే అసలు కథ వేరు. ఆ గ్రామాలు రెండిటికీ కావాల్సిన స్థానిక నాయకుడు( బంగారం వ్యాపారి కూడా) కి అనుకోకుండా బోలెడన్ని బంగారం బిస్కెట్లు దొరుకుతాయి. అందులో ఒకదాన్ని తీసుకెళ్ళి దాని ఒరిజినల్ యజమానికే అమ్మడానికి ప్రయత్నిస్తాడు. ఇక్కడి నుంచీ కథలో రకరకాల చిత్ర విచిత్రమైన పాత్రలు ప్రవేశిస్తాయి. ఈ స్థానిక నాయకుడి వద్దనుంచీ తన బంగారం బిస్కెట్లు ఎలాగైనా తిరిగి తెచ్చుకోవాలని ఆ ఒరిజినల్ వ్యాపారి నియమించుకున్న ఫీలింగ్స్ రవి అనే పాత్ర, స్థానిక నాయకుడికి సహాయకుడిగా ఉన్న మ్యూట్ అనే తెలివిగల అవివేకి పాత్ర, తెలివిలేని ఓ చిల్లరదొంగ, స్థానిక నాయకుడి కూతురూ, ఆమె ప్రేమించిన కారు డ్రైవరూ, చిల్లరదొంగకి సహాయం కోసం వచ్చిన మరో అమ్మాయీ.. ఇంకా బోలెడంత మంది కథలోకి వచ్చేస్తారు. ఊపిరి సలపనివ్వని మలుపులతో కథ శరవేగంతో పరుగులుతీస్తుంది. సినిమా మొదలైన పదినిమిషాల్లోనే బోలెడన్ని మలుపులు వచ్చేసి సినిమా క్లైమాక్స్ కి వచ్చేసింది కదా అనిపిస్తుంది. ఐనా రెండు గంటలపాటు ఎక్కడా వేగం తగ్గకుండా సినిమాని నడిపించిన దర్శకుడికి ఇదే మొదటి సినిమా అంటే నమ్మలేం. ఇన్ని మలుపులూ, ఇన్ని పాత్రలూ ఉన్న సినిమా, అందునా కామెడి సినిమాని ప్రేక్షకులకేమాత్రం గందరగోళం లేకుండా నవ్విస్తూ నడిపించాలంటే స్క్రీన్ ప్లే రాసుకోవడం అంత సామాన్యమైన విషయమేమీ కాదు. అలానే ఎడిటింగ్ కూడా పెద్ద కసరత్తే. దర్శకుడు చాలా పాత్రలకి ప్రవేశపెట్టిన సరికొత్త మేనరిజంస్ బావున్నాయి. అంచనాలేమీ లేకుండా ఈ సినిమా చూడండి. ఆసాంతం హాయిగా నవ్వుకోవచ్చు.

****




**Castaway** on the Moon is a 2009 South Korean film written and directed by Lee Hae-jun

జీవితంలో అన్నీ కోల్పోయి, అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్యే శరణ్యమని నమ్ముతాడు. ఓ నది పైనున్న వంతెనమీదనుంచి దూకేశాడు. నదిలో మునిగిపోవడానికి బదులు, కొట్టుకుంటూ వెళ్ళి అదే నది మధ్యలో ఉన్న ఒక దీవిలో తేలాడు. అక్కడనుంచి చూస్తే రెండుమూడు మైళ్ళదూరంలో నగరం కనిపిస్తుంది, మధ్యలో నది.! ఆ దీవినుంచి బయటపడడానికి, చేతనైనన్ని ప్రయత్నాలు చేశాడు. ఐనా వెనక్కి వెళ్ళి మళ్ళీ అప్పుల బాధతో బతకడం కంటే ఆ దీవిలోనే ఒంటరి జీవితమే మేలనుకున్నాడు. కథ మొదలైంది. మానవ సంచారం లేని ( నిషేధించబడిన) ఆ దీవిలో ఒంటరైన వ్యక్తి ఎలా బతకగలడు? తిండి తిప్పలు ఎలా ? అసలు అతని మానసిక స్థితి ఎలా ఉంటుంది,? ఎవరితో మాట్లాడుతాడు ? ... దాదాపు నలభై ఐదు నిమిషాలపాటు ఆ ఒక్కడి చుట్టూనే ఎన్నో దృశ్యాలూ!!. ఒక ఏకపాత్రాభినయంలా సాగినా ఎక్కడ విసుగు రాకుండా కథ నడిపిన దర్శకుడి కల్పనా శక్తికి జోహార్లు చెప్పక తప్పదు. సినిమా దాదాపు సగం అయ్యాక ఆ ఒంటరి యువకుడికి ఎవరో ఎక్కడునుంచో తనని గమనిస్తున్నారన్న అనుమానం వచ్చింది. ఆ గమనిస్తోంది, మైళ్ళ దూరాన, నదికి ఆవలి ఒడ్డున ఉన్న నగరంలో ని ఒక ఎపార్టుమెంట్ లోని యువతి. ఆ అమ్మాయి విచిత్రమైన మనసిక వ్యాధివల్ల కొన్ని సంవత్సరాలుగా చీకటిగదికే పరిమితమై పోయింది. అర్ధరాత్రి టెలిస్కోప్ లో చంద్రుడ్ని చూసే క్రమంలో, ఇదిగో దీవిలో విచిత్రంగా ప్రవర్తిస్తున్న ఉన్న ఈ యువకుడు కనిపించాడు. కథలో రెండో పాత్ర ప్రవేశించింది. అతనికి ఆ అమ్మాయి కనిపించే అవకాశం లేదు. ఆ అమ్మాయికి అతనితో సంభాషించే అవకాశం రాదు. కొన్ని నెలలపాటు జరిగే కథ చిత్ర విచిత్రమైన మలుపులు తిరుగుతూ సినిమాటిక్ గా ముగిసినా ఓ చక్కటి అనుభూతిని మిగులుస్తుంది.

ఆ యువకుడు ఒంటరిగా బ్రతాకలనుకున్న క్రమంలో ఎదురైన అనుభవాలనుంచి ఎంతో వేదాంతాన్ని పిండుకోవచ్చు, ఎన్నో అర్థాలని అన్వయించుకోవచ్చు. 98 శాతం సినిమాలో కనిపించేవి రెండే పాత్రలు..!ఆ రెండు పాత్రలు పోషించిన నటీనటులని, సినిమాని రూపొందించిన దర్శకుడిని ఎంత అభినందించినా సరిపోదు..!

పూర్తి వైవిధ్యభరితమైన సినిమా కావలనుకున్న వాళ్ళకి ఈ చిత్రం తప్పక నచ్చుతుంది. !!

★★★★




BUEN DÍA, RAMÓN (Guten Tag, Ramón) – A Spanish / German Film..

------------------------------------------------ ------------------

అతి పేదరికంలో ఉన్న ఓ ఇరవయ్యేళ్ళ మెక్సికన్ యువకుడు, అమ్మ, అమ్మమ్మల కోసమైనా అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించాలి అనుకున్నాడు. ఐదు సార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. జెర్మనీలో ఐతే ఇమ్మిగ్రేషన్ అధికారులు మరీ ఇబ్బంది పెట్టరనీ, అక్కడున్న తన ఆంటీ ఎడ్రసు ఇస్తాననీ, ఆమె సహాయం చేస్తుందనీ మిత్రుడొకరు సలహా ఇచ్చాడు. అతని మాటలు నమ్మి , పొలం అమ్మగా వచ్చిన డబ్బుల్తో , జెర్మనీ వెళ్ళాడు. పూర్తిగా కొత్త ప్రదేశం. ఇతడి స్పానిష్ అక్కడెవరికీ అర్థం కాదు. వాళ్ళు మాట్లాడే జెర్మన్ భాష ఇతనికి తెలీదు. ఎలానో కష్టపడి రెండు రైళ్ళు మారీ, రెండు మైళ్ళు నడిచీ ఆ మిత్రుడి ఆంటీ ఎడ్రసు పట్టుకున్నాడు. అక్కడికి వెళ్ళేసరికి, ఆమె లేదు సరికదా, ఆ ఇంట్లో ఉన్నతను దురుసుగా సమాధానం చెప్పి తలుపు వేసేశాడు. అక్కడ్నుంచి మొదలైంది ఆ యువకుడు రమోన్ ప్రయాణం. ఏమీ తెలీని దేశం, భాష రాదు, జేబుల్లో డబ్బుల్లేవు. వివిధ అనుభవాల తర్వాత ఓ ముసలావిడ తన బేస్ మెంట్ లో ఆశ్రయమిస్తుంది. అది వృద్ధులుండే అపార్ట్మెంట్ కాంప్లెక్స్. అక్కడున్న ముసలివాళ్ళకి సహాయం చేస్తూ, ( భాషరాని చోట అంతా సైగలతోనే జీవితం) మిగుల్చుకున్న కొంచెం డాలర్లనీ మెక్సికో పంపిస్తూ ఫర్వాలేదనుకుంటున్న సమయంలో ఓ మలుపు, ఓ కుదుపు . సరైన డాక్యుమెంట్లు లేకుండా జెర్మనీలో ఉంటున్నాడనే కారణంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు అతడ్ని వెనక్కి మెక్సికోకి పంపేశారు. మళ్ళీ తన గ్రామంలో కటిక పేదరికంలో జీవితం కొనసాగుతోంది. చివరి పదినిమిషాల్లో దర్శకుడు తిప్పిన మలుపు సినిమాకి పతాక సన్నివేశం. అక్కడక్కడా మిగిలివున్న మానవత్వానికి భాషా భేదం, ఖండాల సరహద్దులూ , జాతి విభేదాలూ లేవనే అంతర్లీనమైన సందేశం కరుణరసానికి చక్కటి నిదర్శనంగా నిలుస్తుంది.

చిత్రంలో పెద్ద పెద్ద మలుపులు లేవు, హడివిడీ, గందరగోళం ఏమీ ఉండదు. సూటిగా , సరళంగా సాగే స్క్రీన్ ప్లే తో ప్రేక్షకుల్ని ఆ రమోన్ పాత్రతో కలిపి నడిపిస్తాడు దర్శకుడు. Ramón పాత్రధారి Kristyan Ferrer నటన ఈ సినిమాకి పెద్ద హైలైట్! ఫీల్ గుడ్ సినిమాలని అభిమానించే ప్రేక్షకులకి తప్పక నచ్చే సినిమా .!!

***




Where Is the Friend's Home? (Persian: خانه دوست کجاســـت, Khane-ye doust kodjast) is a 1987 Iranian film directed and written by Iranian director Abbas Kiarostami

-------------

దాదాపు మూడు దశాబ్దాల క్రిందట 1987 లో వచ్చిన ఇరానియన్ సినిమా. ఇప్పటికీ తాజాగా అనిపిస్తుంది.

నేను చూసిన చాల ఇరానియన్ సినిమాల్లాగానే ఈ సినిమాలో కూడా కథాంశం పరిధి చాలా చిన్నది. కథలో 95 శాతం కొద్ది గంటల్లో జరిగే సంఘటనలే. ఎనిమిదేళ్ళ కుర్రాడి చుట్టూ తిరుగుతుంది ఈ సినిమా అంతా. సినిమా ఈ ఎనిమిదేళ్ళ కుర్రాడు, అహ్మద్, క్లాసు రూములో మొదలౌతుంది. ఈ కుర్రాడి పక్కనున్న మరో కుర్రాడ్ని హోం వర్క్ చేసుకురాలేదని టీచర్ బాగా కోప్పడతాడు. ఇలా ఐతే రేపు క్లాసుకి కూడా రానివ్వనంటాడు. ఇదంతా గమనించాడు మన అహ్మద్. సాయంకాలం ఇంటికి వచ్చాక చూస్తే తన పుస్తకాలతో పాటు ఆ పక్కనున్న కుర్రాడి నోట్ బుక్ కూడా వచ్చేసింది. ఆ నోట్ బుక్ లో హోం వర్క్ చెయ్యకపోతే టీచర్ ఆ పక్క కుర్రాడ్ని రేపు స్కూలుకి రానివ్వడు. అందువల్ల ఎలాగైనా ఆ కుర్రాడి ఇంటికెళ్ళి ఆ నోట్ బుక్ ఇచ్చెయ్యాలని మన అహ్మద్ తపన. ఆ ఇల్లు చాలా దూరాన కొండ అవతల ఎక్కడో ఉంది , 'ఇప్పుడు అంత దూరం వెళ్ళొద్దు ' అని తల్లి కోప్పడుతుంది. 'పాపం రేపు అతడ్ని క్లాసులో కూర్చోనివ్వడమ్మా. ఇది నా పొరబాటు. ఎలాగైనా వెళ్ళి అతనికి ఇచ్చి వస్తాను ' అని తల్లిని బతిమాలినా ఒప్పుకోదు. ఐనా ఆ చిన్నపిల్లాడి మనసు ఊరుకోదు. తల్లి చూడకుండా బయటపడ్డాడు. కొండదాటుకుని దాదాపు కొన్ని మైళ్ళు కాలినడకన వెళ్ళి క్లాస్ మేట్ కి ఆ పుస్తకం ఇచ్చేయ్యాలని బయలుదేరాడు. ఇక్కడ్నుంచీ కథలోని కీలకమైన ఘట్టాలు మొదలౌతాయి. అతని ఊరు వెళ్ళడం, అతని ఇల్లు వెదికే క్రమంలో ఎదురైన రకరకాల మనుషులూ, సన్నివేశాలూ, ఎంత వెదికినా అతని ఇల్లు దొరక్కపోవడం, ఇంతలో చీకటి పడడం.. – మనల్ని తనతో తీసుకెళ్తాడు ఆ ఎనిమిదేళ్ల అమాయకమైన కుర్రాడు. అతని ప్రయత్నం ఏమైంది, మర్నాడు క్లాసు రూములో ఏం జరిగింది అనేది పతాక సన్నివేశం.. అహ్మద్ పాత్ర ధరించిన కుర్రాడు నటుడిలా అనిపించడు, అందులో జీవించాడు.! ఇంత చిన్న కథతో గంటన్నరపాటు కదలకుండా కూర్చోబెట్టగలిగిన దర్శకుడ్ని, దశబ్దాలు గడిచినా వన్నెతరగని కథాంశాన్ని ఎన్నుకున్న అతని ఊహాశక్తికి అభినందనలు చెప్పి తీరాలి.  ఎప్పటిలానే సున్నితమైన సినిమాల పట్ల ఆసక్తి ఉన్న వారికి తప్పక నచ్చే చిత్రం.

*****




పెద్దలూ తప్పక చూడల్సిన మరో అద్భుతమైన పిల్లల సినిమా.

Bekas is a Kurdish movie written and directed by Karzan Kader and released in 2012

కుర్దిస్తాన్ లో కొండలమధ్య ఓ గ్రామం. ఆ వూళ్ళో ఇద్దరు అనాధలైన అన్నదమ్ములు. అన్న వయసు పదేళ్ళు, తమ్ముడి వయసు ఆరేళ్ళు. తల్లిదండ్రులు లేని ఆ పిల్లలు బూట్ పోలిష్ చేసుకుని వచ్చిన కొద్ది ఆదాయంతో బతుకుతూ ఉంటారు. రాత్రి ఐందంటే ఈ ఇంటి చూరు కిందో, మసీదు అరుగుమీదో నిద్ర. ఆ వూళ్ళోకి వచ్చిన సూపర్ మేన్ సినిమా చూడలని ఆశ. టిక్కెట్టుకి డబ్బులు లేక, హాలు కప్పుమీద కెక్కి, అక్కడున్న కంతలోంచి ఆ సినిమా చూస్తారు. సూపర్ మేన్ ని కలుసుకోవాలని అనిపిస్తుంది. సూపర్ మేన్ ని కలవాలంటే అమెరికా వెళ్ళాలి. అమెరికా ఎక్కడ ఉంటుందో కూడా తెలీని పసితనం, అమాయకత్వం.అన్నయ్య ఎక్కడో ఒక మేప్ తెచ్చి తమ్ముడికి ఆఫ్రికానో ఏదో చూపించి అదే అమెరికా వెళ్దాం పద అని బయలుదేరుతారు. బయలుదేర బోయే ముందు అమ్మా, నాన్నల సమాధుల వద్దకెళ్ళి 'అమ్మా... మేము అమెరికా వెళ్ళి సూపర్ మేన్ ని కలుసుకుంటాం. అతను వొచ్చి మిమ్మల్ని బతికిస్తాడు..' అని చెబుతారు. వాళ్ళ వద్ద ఉన్న కొద్ది దీనార్లు ఇచ్చి ఒక గాడిదని కొంటారు. తమ్ముడు దానికి మైకేల్ జాక్సన్ అని పేరు పెడతాడు. ఆ గాడిద మీద అన్నదమ్ముల ప్రయాణం మొదలౌతుంది. (వాళ్లతో బాటు చూస్తున్న ప్రేక్షకులూ ప్రయాణిస్తారు!) చేరలేని అమెరికా కోసం ఆ పిల్లలు చేసే ప్రయాణంలో ఎదురయ్యే రకరకాల మనుషులూ, అనుభవాలు, ఆన్నాదమ్ముల అనుబంధం. కాస్త చిరుకోపాలూ, ఓ చిన్న ప్రేమ కథా, దేశ సరిహద్దులు దాటేందుకు స్మగ్లర్ల సహాయం తీసుకుని లారీ క్రింద వేలాడుతూ వెళ్ళడం.. – సినిమా చివరి పది నిమిషాల్లో అత్యంత ఉత్కంఠ భరితమైన సన్నివేశం.. ఆ స్థితిలో పిల్లల్ని చూసి మనసు ద్రవించని ప్రేక్షకులుండరు, తర్వాత సినిమా ముగింపు.. అదీ కథ!. పతాక సన్నివేశాన్నీ, ముగింపునీ సినిమాలో చూస్తేనే బావుంటుంది. కొన్ని నవ్వులు, కొన్ని కన్నీళ్ళు, కొంత ఉద్విగ్నత, కొంత జాలి, కొంత కరుణా.. – అన్నీ భావాలనీ కలిగించే చిత్రం. సినిమా ఐపోయాక కూడా ఆ పిల్లల ముఖాలు వెంటాడుతాయంటే అది దర్శకుడి ప్రతిభకి గొప్ప నిదర్శనం...!! సున్నితమైన సినిమాలని ఆస్వాదించే ప్రేక్షకులు తప్పక చూడల్సిన సినిమా – Kurdish movie Bekas..!

★★★★




Instant Coffee,Instant Energy ల్లాగా Instant Comedy కావాలంటే ఈ సినిమా చూడొచ్చు. Mere Dad Ki Maruti...

చాలా ఆలశ్యంగా ఈ సినిమా చూసే అవకాశం వచ్చింది. మొట్టమొదటి ఫ్రేమునుంచి చిట్టచివరి ఫ్రేము వరకూ నాన్ స్టాప్ కామెడీ.. అరోగ్యకరమైన హాస్యంతో నింపేశాడు దర్శకుడు.

చండీఘర్ లోని ఓ ఉన్నత వర్గానికి చెందిన బిజినెస్ మేన్ కుటుంబం. బిజినెస్ మేన్, భార్య, కొడుకు , కూతురు. ఆ కుటుంబం మొత్తం విచిత్రమైనదే. బిజినెస్ మేన్ నిద్రలో కూడా బేరాలాడుతుంటాడు. ఇంటికొచ్చిన వాళ్ళకి బ్రాండెడ్ సీసాల్లో చవకరకం మద్యం నింపి ఇస్తుంటాడు. కాలేజీలో చదువుతున్న కొడుకుని 'ఎందుకు పనికి రాని వాడివి ' అని పదే పదే తిడుతుంటాడు. కూతురికి పెళ్ళి కుదిరింది. అల్లుడికి కానుకగా ఇవ్వడానికి సరికొత్త మారుతి ఎర్టిగా కారు కొనుక్కొచ్చాడు. కొడుకుని కారుమీద కనీసం చెయ్యికూడా ఇవ్వనివ్వలేదు.మరో నాలుగు రోజుల్లో అమ్మాయి పెళ్ళి. కాలేజీ కుర్రాడికి అనుకోకుండా ఓ అమ్మాయి పరిచయమై రాత్రికి క్లబ్ కి వెళ్దామని అడిగింది. తండ్రికి తెలీకుండా గేరేజ్ లో తాళం వేసి వున్న కారుని తీసుకుని ఆ అమ్మాయితో క్లబ్ కెళ్ళాడు మనవాడు. తాగిన మత్తులో తాళాలు ఎవరికో ఇచ్చేశాడు. తెలివి వచ్చి చూసే సరికి కారు పోయింది. పోలీస్ స్టేషన్ లో రిపోర్టు చెయ్యలేని పరిస్థితి. ఇంట్లో తండ్రికి తెలిస్తే గొడవైపోతుంది. అక్కడనుంచీ కథ పాకాన పడుతుంది. తండ్రికి తెలీకుండ మేనేజ్ చేసే క్రమంలో సెకండ్ హేండ్ కార్లు అమ్మే అతనితో సంఘటనలూ, కార్లు అద్దె కిచ్చే వాళ్ళతో మరింత హాస్యం.. చివరికి సోదరి పెళ్ళి రోజున ఏం జరిగింది – అనేది సినిమాకి క్లైమాక్స్. కామెడీ ఆఫ్ ఎర్రర్స్ తరహాలో జరిగే సంఘటనలు పూర్తి వినోదాన్ని అందిస్తాయి. గంటా నలభై నిమిషాల సినిమాలో నూటికి నూరుశాతం హాస్యమే.! ఈ సినిమాకి ఇంకో ప్రత్యేకమైన బలం సంగీతం. ప్రతి నిమిషాన్నీ సరికొత్త వాయిద్యల సమ్మేళనంతో నింపేసి సినిమా మూడ్ ని ఎంతగానో ఎలివేట్ చేసిన సంగీతదర్శకుడ్ని అభినందించకుండా ఉండలేం. సరదా సినిమాని ఇష్టపడేవాళ్ళు చూడదగ్గ సినిమా.!

***




సినిమాతియ్యడ మనే ప్రక్రియని పేరడి చేస్తూ చాలా కథలూ, వ్యాసాలూ, నాటికలూ, సినిమాల్లోనే కొన్నిదృశ్యాలూ వచ్చాయి. ఓ చిన్న పేరడీలాంటి కథా వస్తువుని రెండున్నర గంటలసేపు నవ్వించే సినిమా కథగా మార్చి ప్రేక్షకులకి చక్కటి వినోదాన్ని పంచాడు దర్శకుడు రాధామోహన్. నెల క్రిందట విడుదలైన, ఆసాంతం నవ్వుల పువ్వులు విరజిమ్మిన తమిళ సినిమా – Uppu Karuvaadu. సినిమా దర్శకుడు కావాలని ప్రయత్నాలు చేస్తున్న ఓ కుర్రాడు ఈ సినిమాలో ప్రధానపాత్ర. . అతనికి సహాయం చేద్దామనుకున్న ఓ పెద్దమనిషి అతడ్ని , నిర్మాత కావాలనుకుంటున్న మరొకాయనకి పరిచయం చేస్తాడు. ఆ వర్ధమాన నిర్మాత భారీ స్థాయిలో ఉప్పుచేపల వ్యాపారం చేస్తుంటాడు. మధ్యమధ్యలో కవిత్వం కూడా వ్రాస్తుంటాడు..! తన కూతుర్ని హీరోయిన్ గా తీసుకోవాలనే షరతు మీద మన ఔత్సాహిక దర్శకుడి తో సినిమా తీయడానికి ఒప్పుకుంటాడు. ఆ అమ్మాయికేమో నటనలో ఓనమాలు రావు కదా, నేర్చుకోవడమూ రాదు. అక్కడ్నుంచి మన దర్శకుడు, స్క్రిప్టు తయారు చేసుకోవడం, రిహార్సల్సూ .. ఆ ప్రయాణంలో పరిచయమయ్యే పాత్రలూ.. వీటితో సినిమా మూడొంతులు పూర్తవుతుంది. పల్లెటూళ్ళో హల్వా షాపులో పనిచేసే కుర్రాడు అసిస్టెంట్ డైరెక్టర్ గా రావడమూ, ఐస్ ఫేక్టరీ లో పనిచేసే వ్యక్తి గాయకుడు కావలను కోవడమూ, సినిమాలో వేషం కావాలనే దొంగబాబా, సినిమా మొదలవ్వకముందే 'మా మనోభావాలు దెబ్బతిన్నాయ ' ని గొడవచేసే వాళ్ళు.. కావలసినంత వినోదం, ఆరోగ్యకరమైన హాస్యం! సరిగ్గా షూటింగ్ ప్రారంభం రోజున అనుకోని మలుపు – ఆ నిర్మాతే ( ఉప్పుచేపల వ్యాపారి) పదిమందిని వెంటేసుకుని వచ్చి యూనిట్ సభ్యుల్ని చితకబాదడం!! దానిక్కారణం, తర్వాత జరిగిన పరిణామాలూ – అదీ మనం చూసే సినిమా క్లైమాక్స్! స్లాప్ స్టిక్ తరహాలో కాక ఒకస్థాయి గల హాస్యాన్ని పండించాడు దర్శకుడు. సరదాగా, హాయిగా నవ్వుకునే సినిమా కావాలంటే సందేహం లేకుండా చూడదగిన చిత్రం!

ఇందులోని ఒక జోక్ – తన ఆఫీసుకి ఎలా రావాలో చెబుతూ ఒకాయన ఫోన్ లో డైరెక్షన్స్ ఇలా ఇస్తాడు " ఆ రోడ్డులో సరాసరి వచ్చెయ్. ' నో యు టర్న్ ' అన్న బోర్డు ఉన్న చోట యు టర్న్ తీసుకో, ఇంకాస్త దూరం వచ్చాక ' నో ఎంట్రీ' అనే బోర్డు వస్తుంది. అందులోంచి సూటుగా లోపలికి వచ్చెయ్, కాస్త దూరం వచ్చాక 'నో పార్కింగ్ ' బోర్డు ఉన్న చోట కారు ఆపి ఎదురుగుండా ఉన్న ఆఫీసుకి వచ్చేయ్. నేనక్కడే ఉంటాను.! "

★★★




Open Tee Bioscope is a 2015 Bengali language Indian coming-of-age comedy-drama film released on 15 January 2015

సునిశితమైన భావోద్వేగాలను మిళితం చేసి , బాల్యాన్ని గుర్తుచేస్తూ,మనసుల్ని తాకే మరో మంచి బెంగాలీ చిత్రం. ఇటీవల మళయాళం, తమిళ భాషల్లో వస్తున్న కొన్ని న్యూవేవ్ సినిమాలని పోలిన సరికొత్త స్క్రీన్ ప్లే టెక్నిక్ ఈ సినిమా ప్రత్యేకతల్లో ఒకటి. దర్శకుడు సినిమా ప్రారంభమైన మొదటి నిమిషంలోనే బోలెడంత కథ చెప్పాడన్న విషయం సినిమా చివరలో కానీ తెలీదు.! విమానం కలకత్తాలో ఆగింది. BMW కారులో లగేజ్ సర్దారు. కారు బయలుదేరింది. డ్రైవర్ నడుపుతుంటే వెనకసీట్లో ఉన్న యువకుడు కలకత్తా వీధుల్ని చూస్తున్నాడు. ఓ ఇరుకు సందులో ఆ విలాసవంతమైన కారు ఆగింది. ఆ యువకుడు దిగి చుట్టూ చూస్తున్నాడు. ఫుట్ బాల్ ఒకటి వచ్చి అతని కాలికి తగిలింది. ఓ చిన్నపిల్లాడు పరుగెత్తుకుంటూ వచ్చి ' ఆ బంతి..' అని అడిగాడు. ఈ యువకుడు ఆ బంతిని కాలుతో తన్నాడు. కెమేరా నేలమీద ఉంది. ఆగి వున్న కారు పక్కనుంచి వేగంగా ఆ బంతి వెనక్కి దూసుకెళ్ళింది.. ఆ బంతి తో పాటే ఆ యువకుడి జ్ఞాపకాలూ వెనక్కి వెళ్ళాయి.. ఇదీ సినిమా ప్రారంభం మొదటి నిమిషంలొ జరిగిన కథ.! దిగువ మధ్యతరగతి కుటుంబం.. పుట్టక ముందే తండ్రిని కోల్పోయిన పదిహేనేళ్ళ కుర్రాడు , అతని తల్లి , ఈ కథలో ప్రధాన పాత్రలు అని చెప్పుకోవచ్చు. చదువుకునే హాస్టల్ నుంచి అతన్ని బహిష్కరిస్తే వెనక్కి వచ్చేశాడు. కారణం – స్కూలు వార్డెన్ అతని తండ్రి గురించి అనవసరమైన వ్యాఖ్యలు చేస్తే ఆ వార్డెన్ ని కొట్టాడు. తండ్రి గురించి తల్లి ఎప్పుడూ స్పష్టమైన సమాధానం చెప్పలేదు.తల్లి స్థానిక రాజకీయనాయకుడి ఇంట్లో సేవకురాలిగా పనిచేయడం ఆ కుర్రాడికి నచ్చడంలేదు.ఖాళీగా ఉంటున్న అతను చుట్టుపక్కల ఉన్న కుర్రాళ్ళతో కలిసి అల్లరి చిల్లరగా తిరగడం మొదలుపెట్టాడు. మొదటి నలభై నిమిషాల్లో ఆ మధ్యతరగతి కాలనీలోని ఎన్నో పాత్రల్నీ, ఎన్నో దృశ్యాలనీ ప్రవేశపెడతాడు దర్శకుడు. అన్నీ ఆసక్తికరంగానే ఉంటాయి కానీ, ఇంతకీ కథ ఏమిటీ, ఈ దృశ్యాలూ, పాత్రలూ ఎందుకూ.. అనిపిస్తుంది. కానీ విశ్రాంతి కి పదినిమిషాల ముందు అవన్నీ కథలో భాగాలేనని మనకి తెలీకుండానే ఒప్పిస్తాడు దర్శకుడు. వేగం పుంజుకున్న కథ, విశ్రాంతికి ముఖ్యమైన మలుపు తిరుగుతుంది. రెండో అర్థభాగం మొదలైన ఐదునిమిషాల్లో వచ్చే మలుపుతో ప్రేక్షకుల్ని పూర్తిగా తన అధీనంలోకి తీసేసుకుంటాడు అత్యంత ప్రతిభావంతుడైన దర్శకుడు అనింద్య ఛటర్జీ. ఇందులో సరదాలున్నాయి, సెంటిమెంట్లున్నాయి, కలలున్నాయి, కన్నీళ్ళున్నాయి,అల్లరి స్నేహాలున్నాయి, యౌవ్వనారంభంలోని ప్రేమలున్నాయి.

సినిమా పూర్తయ్యాక ఓ మంచి చిత్రం చూశామన్న అనుభూతి మిగులుతుంది. దర్శకుడు, సినామాటో గ్రాఫర్ కలిసి కొన్ని దృశ్యాలని చిత్రీకరించిన విధానం వాళ్ళ సృజనాత్మకతకి పరాకాష్టగా నిలుస్తుంది. సున్నితమైన సినిమాలకోసం ఎదురుచూసే ప్రేక్షకులు తప్పక చూడాల్సిన సినిమా. ★★★




Kattradhu Thamizh (English: Learned Tamil)is a 2007 Indian Tamil drama film written and directed by newcomer Ram

2007 లో వచ్చిన తమిళ సినిమా. ఇన్నాళ్టికి చూసే అవకాశం దొరికింది. అవార్డులు, విమర్శకుల ప్రశంసలు విరివిగా అందుకున్న చిత్రం.

తల్లిదండ్రులకి దూరమై, దాదాపు అనాథగా బోర్డింగ్ స్కూల్లో పెరిగిన ఓ కుర్రాడు, తన టీచరే రోల్ మోడల్ గా పెరిగాడు. అనుకోని పరిస్థితుల్లో పోలీసులు అన్యాయంగా అరెస్ట్ చేశారు. భరించలేని మానసిక ఒత్తిడితో సైకోగా మారాడు.

మాతృభాషమీద మమకారంతో తమిళంలో ఎమ్మే చదివి టీచర్ గా ఉద్యోగంలో చేరాడు ఓ కుర్రాడు. మాతృభాషని బోధించే టీచర్లమీద స్టూడెంట్స్ కి , సమాజానికి ఉన్న చులకన భావం అతడిలో ఘర్షణ రేకెత్తించింది.

పదేళ్ళ చిన్నతనంలోనే పక్కింటి అమ్మాయి అంటే ఇష్టం ఏర్పడింది ఓ కుర్రాడికి. జీవితం ఆడిన దాగుడు మూతల్లో ఆ అమ్మాయి కలవడం విడిపోవడం.. జరుగుతూ వచ్చింది. ఎన్నో మలుపుల తర్వాత మళ్ళీ తాము చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాల్లో కి వచ్చారు వాళ్ళిద్దరూ. రైలు పట్టాల మీద నడుస్తూ తమ చిన్నతనాన్ని గుర్తు చేసుకుంటున్నారు. రైలు వస్తోంది... ఇంకో ఐదు నిమిషాల్లో సినిమా పూర్తవుతుంది.!!

పై మూడు కథలూ ఒక కుర్రాడి జీవితంలో జరిగినవే. అతడే ఈ సినిమా హీరో.! మూడు విభిన్నమైన ట్రాక్స్ నీ అత్యద్భుతంగా అల్లుకుంటు సినిమాని ఆసాంతం ఆసక్తికరంగా రూపొందించాడు దర్శకుడు. దర్శకుడికి ఇదే మొదటి సినిమా అంటే నమ్మలేం.

విభిన్నమైన సినిమా చూడాలనుకునే వారికి ఖచ్చితంగా నచ్చే చిత్రం ఇది..!

***




Elizabeth Ekadashi is a 2014 Marathi movie

ఇలాంటి సినిమాలని చిన్నపిల్లల సినిమాలు అని వర్గీకరించడం కంటే పెద్దవాళ్ళకోసం చిన్నపిల్లలతో తీసిన సినిమాలు అంటే బావుంటుందేమో అనిపిస్తుంది.. పెద్దపెద్ద ఉపన్యాసాలు, భారీ దృశ్యాలు లేకుండా అతి సున్నితంగా దర్శకులు ఇలాంటి సినిమాల ద్వారా అందించే సందేశాల ముందు భారీచిత్రాలు సైతం తలవంచుకోవాల్సిందే – అంటే కొంచెం అతిశయోక్తిగా ఉండొచ్చు కానీ చాలా సార్లు నిజమే అనిపిస్తుంది.

మహారాష్ట్రలోని పండరీపూర్. భక్తులకి తీర్థయాత్రా స్థలం. అక్కడి ఇరుకు సందుల్లో పావురాయి గూడు లాంటి అతిచిన్న గదిలో , ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం నివసిస్తోంది. కుటుంబపెద్ద చనిపోయాడు. ఏడేళ్ళ కొడుకుని, ఐదేళ్ళ కూతుర్ని, ముసలి అత్తగార్నీ పోషిస్తోంది ఒంటరి తల్లి. తండ్రి సొంతంగా తయారు చేసుకున్న సైకిల్ అంటే ప్రాణం ఆ కుర్రాడికి. దానికి ముద్దుగా ఎలిజిబెత్ అని పేరుపెట్టుకున్నాడు. తొక్కడం రాకపోయినా నడిపించుకునే సైకిల్ని తీసుకెళుతుంటాడు ఎక్కడికి వెళ్ళినా. బాగా తెలివికల వాడు, స్కూల్లోనూ మంచిపేరు తెచ్చుకుంటున్నాడు. కుటుంబపోషణకోసం తల్లి స్వెట్టర్లు కుడుతోంది. బాకీ వాయిదాలు కట్టడం ఆలశ్యం ఐందని బ్యాంకు వాళ్ళు ఓ రోజు ఆ కుట్టుమిషన్నీ తీసుకెళ్ళిపోయారు. తల్లి బతిమాలిగా 'ఐదు రోజులు గడువిస్తున్నాం. అయిదువేలు కడితే నీ కుట్టుమిషన్ తిరిగి ఇస్తాం' అని ఒప్పుకున్నారు బ్యాంకు అధికారులు. కుట్టుమిషన్ తిరిగి తెచ్చుకొవాలంటే సైకిల్ అమ్మక తప్పని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో తన సైకిల్ కాపాడుకోవాలి, తల్లికష్టాలు తీర్చాలి అందుకోసం ఆ ఏడేళ్ళ కుర్రాడు ఏం చేశాడన్నదే ఈ సినిమా కథ. ... చిన్న కథలోనే ఎన్నో పాత్రలూ, ఎంతో సస్పెన్స్, కష్టాలూ, కన్నీళ్ళూ , చిన్ని చిన్ని ఆనందాలూ.. చూస్తున్నంతసేపూ సినిమా అనిపించదు.నిజంగా మనమూ ఆ వూళ్ళో, ఆ ఇరుకు వీధుల్లో, ఆ జనసమ్మర్ధంలో ఆ పిల్లల్తో మనమూ కలిసి నడుస్తున్నట్లే ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణ అంత తేలికకాదు. 90% శాతం వీధుల్లో , జనసమ్మర్ధంలోనే సాగుతుంది. అత్యంత సహజంగా చిత్రీకరించిన దర్శకుడ్ని అభినందించి తీరాలి. ఏడేళ్ళ కుర్రాడి పాత్ర ధరించిన శ్రీరంగ మహాజన్ అద్భుతమైన నటనని ప్రదర్శించాడు. ప్రేక్షకులని తనతో తీసుకెళ్తాడు, కళ్ళు తడి చేస్తాడు.

పెద్దవాళ్ళంతా తప్పక చూడాల్సిన సినిమా..!!

★★★★




Naanum Rowdy Dhaan (English: I, too, am a Rowdy!) is a 2015 Indian Tamil black comedy-action film

ఓ రౌడీ మూలంగా ప్రాణాలు కోల్పోయిన పోలీస్ ఆఫీసర్. ఆ రౌడీ మీద పగతీర్చుకోడానికి బయలుదేరిన ఆ పోలీస్ ఆఫీసర్ కూతురు – చాలా సార్లు విన్న, చూసిన సినిమా కథల్లో భాగమే ఇది. అలా బయలుదేరిన అమ్మాయికి వినికిడి శక్తి పోవడం, కేవలం ఎదుటి మనిషి పెదాల కదిలక ద్వారానే ఏదైనా తెలుసుకోగలగడం – ఈ సినిమాలోని ట్విస్ట్..!

రౌడీల కథలు విని తనూ రౌడీగా మారాలనుకునే కుర్రాడు – ఇది చాలాసార్లు చూసేసిన సినిమా కథే. ఆ కుర్రాడు ఓ లేడీ పోలీస్ ఆఫీసర్ కొడుకు కావడం, అతను రౌడీగా మారాలని చేసే ప్రయత్నాలన్నీ అపహాస్యం పాలై , అతనూ నవ్వులపాలవడం – ఈ సినిమాలో ట్విస్ట్ !

ఆ అమ్మాయి, ఈ అబ్బాయి కలిసి – ఆ అమ్మాయి వెతుకుతున్న రౌడీని పట్టుకుని హతమార్చాలనుకోవడం అదీ కథ. నిజానికి ఇది నలిగిపోయిన పగ, ప్రతీకారం మార్కు కథ. కానీ దర్శకుడు ఈ కథని పూర్తిగా నవ్వుల బాటలోకి నడిపించి కొత్త సినిమాగా మార్చాడు. కడుపుబ్బ నవ్విస్తూ , మధ్యలో వచ్చిన సీరియస్ దృశ్యాలని బాలెన్స్ చేస్తూ ఆద్యంతం ఆసక్తికరం చేశాడు దర్శకుడు. హీరో హీరోయిన్లు ఉన్నా 'కట్ చేస్తే..' పాటలు లేవు. ఉన్న నేపథ్య గీతలని హిట్ పాటలుగా స్వరపరిచాడు అనిరుధ్. నయనతార గ్లామర్ తారగా కాక వినికిడి శక్తి లేని అమ్మాయిగా అద్భుతమైన నటన ప్రదర్శించింది. విజయ్ సేతుపతి వైవిధ్యభరితమైన పాత్రల్లో ఎలా రాణించగలడో మరోసారి నిరూపించుకున్నాడు.

రెండుగంటలపైగా హాయిగా నవ్వుకుంటూ చూడదగిన ఫక్తు కమ్మర్షియల్ చిత్రం ఇది..!

★★★




2011 లో వచ్చిన సినిమా. చాలా ఆలశ్యంగా చూసే అవకాశం లభించింది.

Chillar Party is a 2011 Indian children's film .. A story of grit and determination, it works not just as an entertainer, but also advocates a message rather strongly.

ఇది పిల్లల సినిమాగా పేరు తెచ్చుకుంది, బహుమతులు గెలుచుకుంది. నిజానికి ఇది పెద్దల సినిమానే అని చెప్పుకోవచ్చు. పెద్దలు నేర్చుకోవాల్సిన ఎన్నో పాఠాలని పిల్లలు తాము ఆచరించి చూపించారీ చిత్రంలో. ఒక ఎగువ మధ్యతరగతి ఎపార్ట్మెంట్ కాంప్లెక్స్ లోకి ఓ పదేళ్ళ కుర్రాడు, తన కుక్కపిల్లతో సహా వచ్చాడు. ఓ ఫ్లాట్ లో ఉండే ఒకాయన తన కారు తుడిచేందుకు ఆ కుర్రాడిని నియమించుకున్నాడు. అక్కడే నిరుపయోగంగా పడి ఉన్న ఒక పాతకారు ఆ కుర్రాడికీ తన కుక్కపిల్లకీ నివాసం. ఎపార్ట్మెంటుల్లో ఉండే మిగత పిల్లలు కొత్తలో ఆ కుర్రాడిని ఆటపట్టిస్తారు కానీ తొందరలోనే అతడినీ తమ మిత్రబృందం లో చేర్చుకుంటారు. అనుకోని పరిస్థితుల్లో అతి చిన్న సంఘటనే అనుకున్నది పెద్ద సమస్యగా మారి ఆ పనికుర్రాడి ఉనికే ప్రశ్నార్థకమౌతుంది. ఆ సమయంలో ఆ కాలనీలోని పిల్లలంతా కలిసి ఆ అతి పెద్ద సమస్యని , బడా రాజకీయనాయకుడ్ని సైతం ఎదిరించి ఆ కుర్రాడిని ఎలా రక్షించారన్నది సినిమా కథ. ఇది చిన్నపిల్లల సినిమానే కదా అని దర్శకుడు ఎక్కడా రాజీ పడలేదు. వందలాది మంది పిల్లలు తమ నిరసన తెలియచేయడానికి అర్ధనగ్నంగా బొంబాయి వీధుల్లో ఊరేగిన దృశ్యాన్ని – ఓ భారీ హీరో సినిమాలోని ఘట్టంలా చిత్రీకరించాడు దర్శకుడు. పతాక సన్నివేశం కూడా అంత పకడ్బందీగానూ ఉంది. ఎన్నో నిత్యజీవిత సత్యాలని చిన్న చిన్న సంఘటనలద్వారా దర్శకుడు చెప్పిన విధానం అమోఘం. పెద్ద పెద్ద నటులకి సైతం నటనలో పాఠాలు నేర్పే స్థాయిలో నటించారు ఇందులోని పిల్లలంతా! పిల్లలతో బాటు పెద్దలుకూడా తప్పని సరిగా చూడాల్సిన చిత్రం ఇది..!

★★★